# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,ఆదివారం,
ఏప్రిల్ 26, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:276

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

ఆదివారం, తేది:26-04-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,వైశాఖ మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,శుక్ల పక్షం,దశమి,మఘ,వర్జ్యం,ప.11.20ల 12.53




## ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో

# వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం

**మూడు ప్రధాన పార్టీలపై విరుచుకుపడ్డ కవిత**
**కేసీఆర్ మారిపోయినందుకే రంగంలోకి వచ్చా**
**టీఆర్ఎస్ ఆవిర్భావ సభలో కవిత**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ జెండా, అజెండాలను ఆవిష్కరించారు. రాష్ట్రంలో కొత్త విప్లవం మొదలైంది... ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అయ్యి తీరుతాను... ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు. గులాబీ బాస్ కేసీఆర్‌ను మరమనిషితో పోల్చడం... సీఎం రేవంత్‌ని కర్కోటకుడిగా తేల్చడం... హిట్లర్ అంటూ దెప్పిపొడవడం... బీజేపీ ఎంపీలకు సవాల్ విసరడం లాంటి వ్యాఖ్యలతో కవిత ప్రసంగం ఆద్యంతం వాడివేడిగా సాగింది. ఎక్కడ కష్టం వచ్చినా సారు రారు.. సారు రారు. అదే సారు తెలంగాణను వదిలిపెట్టి... దేశంలోని ఇతర రాష్ట్రాలకు తిరిగొచ్చారు. అదే మన సార్ అయితే కుర్చీ వేసుకొని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును దగ్గరుండి పూర్తి చేసేవారు. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేయడానికి ముందుకొచ్చినట్టు తెలిపారు. ఇపుడే మొదలు పెట్టినా... ముందుంది ముసళ్ల పండుగ అంటూ ఆద్యంతం పంచ్ డైలాగులు విసిరారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు అవినీతి, బంధుప్రీతి, అధర్మంతో నిండిపోయాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు.

# ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ



**విక్రమ్-1 ఫ్లాగ్ ఆఫ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): దేశంలో ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ అవతరించనుందని, రాష్ట్రం ఏరోస్పేస్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ హైదరాబాద్ నగరంలోనే రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1ను శ్రీహరికోటకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుతో కలిపి జెండా ఊపి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ ప్రయోగ ప్రయత్నం చేయ డానికి స్కైరూట్ సిద్ధంగా ఉండటం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రయోగ స్థలానికి రాకెట్ లాంఛనంగా బయలుదేరింది. రాబోయే నెలల్లో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ ప్రయోగానికిస్కైరూట్ సిద్ధమ వనుంది. ఈ సందర్భంగా స్కైరూట్ బృందాన్ని సీఎం ప్రశంసించారు. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లేందుకు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్‌ను స్కైరూట్ హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం ఏరోస్పేస్ రంగంలో ఈ రాష్ట్ర వృద్ధికి ఇదొక మైలురాయి అని అభివర్ణించారు.

# 9న తెలంగాణకు ప్రధాని మోది



**మామునూరు విమానాశ్రయానికి భూమి పూజ**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన తేదీ ఖరారైంది. వచ్చే నెల 9వ తేదీన ఆయన హైదరాబాద్‌లో పర్యటించనున్నారు వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్ పోర్ట్ పనులకు ప్రధాని భూమి పూజ చేస్తారని వార్తలు వస్తున్నాయి. అదే రోజు సాయంత్రం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమా లకు ప్రధాని శంకుస్థాపన చేయను న్నారని పార్టీ వర్గాలను బట్టి తెలుస్తోంది. ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేస్-2ను ప్రారంభించే అవకాశాలు న్నాయి. రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేస్తారని సమాచారం. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి.

# జనంలోకి 47 మంది మావోలు

**డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగించిన మావోలు**
**ఆపరేషన్ కగార్ విజయంతోనే ఇది సాధ్యమైందని వెల్లడి**
**లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే**
**ఆయుధాలు వీడి జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు**



హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): తెలంగాణ పోలీసుల ఎదుట మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టు లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. 32 తుపాకులను కూడా పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు మరియు దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్చార్జి హేమ్లా ఇతు అలియాస్ విజ్జా, నిడివిజనల్ కమిటీ సభ్యుడు 9వ ప్లాటూన్ కమాండర్ పోడియం లచ్చు అలియాస్ మనోజ్ వంటి ముఖ్య నాయకులు ఉన్నారు. లొంగి పోయిన మావోలు పోలీసులకు 32 ఆయుధాల తో పాటు వివిధ క్యాలిబర్లకు చెందిన 515 తూటాలను అప్పగించారు. పోలీసులకు సమర్పించిన ఆయుధాలో ఎల్ ఎమ్ జీ 4 ఏ కే 47 రైఫిల్స్ 3,ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్,2 - ఇన్సస్ రైఫిల్స్‌ని2 -410 మస్కట్ రైఫిల్స్1-8ఎమ్ ఎమ్ రైఫిల్‌ని12 - సింగిల్-షాట్ గన్స్,1 - 9ఎమ్ ఎమ్ పిస్టల్‌ని1-రివాల్వర్,2 -బీ జిఎల్ గన్స్2 -ఎయిర్ గన్స్,1-ఎస్‌బిబి ఎల్ గన్ లు ఉన్నాయి.



# ప్రభుత్వం ఆధీనంలోకి మెట్రో

**చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్ మెట్రో రైలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ భాగస్వామ్య సంస్థ ఎల్ అండ్ టీ చేతిలో ఉన్న వాటాలన్నీ స్వాధీనం చేసుకోవాలని ఇదివరకే తీర్మానించిన రేవంత్ సర్కారు... ఈనెల 30వ తేదీలోగా సుమారు రూ.15 వేల కోట్ల డీల్ పూర్తి చేయాలని నిర్ణయించింది. దీంతో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 ప్రాజెక్ట పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రానుంది. ఈ మార్పుల నేపథ్యంలో మెట్రో రైల్ బోర్డులో కీలక నియామకాలు కూడా జరిగాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును బోర్డు చైర్మన్‌గా నియమించింది. మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాగనున్నారు. అలాగే బోర్డు డైరెక్టర్లుగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు జయేశ్ రంజన్, వికాస్ రాజ్, ఫైనాన్స్ సెక్రటరీ సుల్తానియా, అలాగే శివధర్ రెడ్డిని తెలంగాణ సర్కార్ నియమించింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ, విస్తరణ, భవిష్యత్తు ప్రణాళికలు పూర్తిగా ప్రభుత్వ చేతుల్లోకి రానున్నాయి.

## 2028 నాటికి ప్రభుత్వ సేవలు..




ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచంలోనే తొలిసారి ఒక దేశం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ప్రభుత్వ కార్యకలాపాలను, సేవలను అందించడానికి సిద్ధమవుతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 2028 నాటికి ప్రభుత్వ కార్యకలాపాల్లో సగం ఏజెంటిక్ ఏఐ ద్వారా నడుస్తాయని యూఏఈ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తూమ్ వెల్లడించారు. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో పెద్ద సంచలనం సృష్టిస్తోంది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఏఐ టూల్స్ మనకు సహాయం చేస్తాయి. కానీ ఏజెంటిక్ ఏఐ మాత్రం స్వయంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎవరి పర్యవేక్షణా లేకుండా పనులను నిర్వహిస్తుంది. రియల్ టైమ్‌లో స్పందిస్తుంది. ఏజెంటిక్ ఏఐ అనేది కేవలం ఒక సహాయకుడిలా కాదు.. ఓ సహ చరుడిలా పనిచేస్తుంది. అంటే ఓ ఎగ్జిక్యూటివ్ భాగస్వామిలా అన్నమాట. ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలను మెరుగుపరచడానికి, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయడానికి ఏజెంటిక్ ఏఐను యూఏఈ పూర్తి స్థాయిలో వినియోగించనుంది.


## రెండో విడత ఇండ్లకు

# ముహూర్తం ఖరారు

**27 నుంచి మంత్రి పొంగులేటి సమీక్షలు**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ,హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీ సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. ని నిరాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తి గా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. నినిఅదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

# ఈమె రాష్ట్రాన్ని,ఆయన దేశాన్ని నాశనం చేస్తున్నారు



ఢిల్లీ (మెట్రోన్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ లపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరూ అధికారం కోసం ఆరాటపడుతూ దేశ సంపదను ధనికులకు దోచిపెడుతున్నారని ఆయన ఆరోపించారు. తన చర్యలతో మమతాబెనర్జి బెంగాల్‌ను నాశనం చేస్తే.. మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్నది ఎన్నికల పోరాటం కాదని, సిద్ధాంతాల పోరాటమని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ఐక్యత, సౌభ్రాతృత్వం.. మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ద్వేషం, హింస మధ్య పోరాటం జరుగుతోందని న్నారు. హుగ్లీ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ముందస్తు సాగు ప్రణాళికలపై మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** వచ్చే వర్షాకాలంలో ఎల్.ని.నో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉంటుదన్న వాతావరణ శాఖ నిపుణుల అంచనాలతో... ముందస్తు సాగు ప్రణాళికలపై మంత్రి తుమ్మల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాధారణంగా రాష్ట్రంలో దక్షిణా తెలంగాణ కన్నా ఉత్తర తెలంగాణాలో అధిక వర్షపాతం నమోదవుతుందని తెలిపారు.ఇప్పటివరకు ఉన్న వివరాల ప్రకారం ఎల్.ని.నో ప్రభావంతో వచ్చే వర్షాకాలంలో ఉత్తర తెలంగాణలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాణ అతి తక్కువ వర్షాపాతం నమోదు అవుతుందని అంచనాల వేస్తున్నట్టు వాతావారణ నిపుణులు ఈ సందర్భంగా మంత్రికి తెలిపారు మే 15 కల్లా వాతావరణ శాఖ నుండి ఖచ్చితమైన నివేదిక తెప్పించుకొని, జిల్లా వారిగా అక్కడి వాతావారణం మరియు వర్షపాతాల అంచనాల ఆధారంగా రైతులు ఏ ఏ పంటలు వేయాలో తెలిపే విధంగా సమగ్ర పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో కూరగాయల సాగు, పప్పుధాన్యాలు, మిల్లెట్లు మరియు నూనే గింజల వంటి పంటల సాగు విస్తీర్ణాలు గణనీయంగా తగ్గిపో యాయని మంత్రి అన్నారు. 2013,14లో రాష్ట్రంలో రైతులు ఒకే రకమైన పంటను ఎక్కువగా వేయడంతో భూమి సారం తగ్గడంతో పాటు, యూరియా వాడకం కూడా పెరుగుతుందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లో కాంప్లెక్స్ ఎరువుల ధర అధికంగా ఉండటం కూడా



ఒక కారణమని మంత్రి అభిప్రాయపడ్డారు. కాంప్లెక్స్ ఎరువుల కన్నా.. యూరియా ధరలు తక్కువకు దొరకడంతో రైతులు కాంప్లెక్స్ ఎరువులకు బదులు యూరియాను అధికంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఎరువులు మరియు యూరియా ధరలు అన్నింటిని రేషనలైజ్ చేయాలని కేంద్రాన్ని ఎన్నో సార్లు కోరినప్పటికి కేంద్రం పట్టించుకోవట్లేదని అన్నారు. రాష్ట్రంలో అనుకూలమైన సాగు పరిస్థితులు ఉన్నప్పటికి వీటి సాగు విస్తీర్ణం తగ్గటం వాంచనీయం కాదని పేర్కొన్నారు. మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వీటి సాగును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తెలిపారు. మన అవసరాల కోసం పక్క రాష్ట్రాలపై ఆధార పడకుండా, మన రాష్ట్రంలోని కూరగాయలు, పప్పుధాన్యాలు, మిల్లెట్లు మరియు నూనె గింజల సాగును పెంచే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ అధికారులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులను మంత్రి ఆదేశించారు. సీడ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కార్మికులతో కలిసి సంబరాలు జరపండి :పొన్నం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ లు , అధికార ప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం జూమ్ సమావేశం నిర్వహించారు.ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల పై ఆర్టీసీ కార్మికులతో కలిసి పండగల సంబరాలు జరపాలని ఆయన పిలుపు నిచ్చారు.రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి కార్మికుల చిరకాల స్వప్నం ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం ,కార్మిక సంఘాల ఎన్నికలు ,11 శాతం పీఆర్సీ ప్రకటన పై ఆర్టీసీ కార్మికులు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా వారితో పార్టీ క్యాడర్ కార్యక్రమాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు ఆర్టీసీ కార్మికుల సమస్యలు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలు పరిష్కారం చేసి సమ్మె విరమింప చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ క్యాడర్ మొత్తం ఇన్వాల్ అయి సంబరాలు నిర్వహించాలన్నారు వారి ప్రధాన డిమాండ్స్‌కి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.అందులో ఆర్టీసీ విలీనం చేయడం.కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిన నిర్ణయం ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటన మిగతా ఆర్టీసీ కార్మికుల సమస్యల పై కూడా పరిష్కారం చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## బాగా పని చేయండి..ఎక్సైజ్ శాఖకు గౌరవం తీసుకురండి

### ఎక్సైజ్ ఈడీ షానవాజ్



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** గంజాయి, డ్రగ్స్ పట్టుకున్న ఎక్సైజ్ టీమ్‌లకు నగదు ప్రోత్సహాకాలను ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ప్రధానంచేశారు.ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ టీములు బాగా పని చేసి ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తీసుకరావాలని ఆయన పిలుపు నిచ్చారు.గంజాయి, డ్రగ్స్ పట్టుకున్న 20 ఎక్సైజ్ టీమ్‌లకు ఆబ్కారీ భవన్ లోని డైరెక్టర్ చాంబరులో శనివారం నగదు ప్రోత్సహాకాలను ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అందజేశారు.ఎన్ ఫో ర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటివ కమి షనర్ ప్రణవీలు ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్‌తోపాటు ఎన్ఫోర్స్ మెంట్, డీటీఎఫ్, ఎక్సైజ్ టీమ్‌ల సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా స్వామ్యంలో పార్టీలకు స్వాగతం :మహేష్ గౌడ్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ) :** ప్రజా స్వామ్యంలో కొత్త పార్టీలకు స్వాగతమని కవిత పార్టీ పెట్టినందుకు అభినందనలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.శనివారం ఆయన గాంధీ భవన్లో మీడియా తో మాట్లాడారు గత పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలోని మాట మరిచిపోవద్దని 2014 నుంచి 2023 బిఆర్ఎస్ దోపిడీలో కవిత కి భాగస్వామ్యం ఉందని ఆయన తెలిపారు. దోపిడి పై కవిత వివరణ ఇవ్వడం లేదని అన్నారు.మహిళ సాధికారత కోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్ పై కవిత వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు.మహిళ కేంద్రంగా ప్రజా పాలన సాగుతుందని,ప్రజల ఆకాంక్షల మేరకు పాలన సాగుతుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పట్టణీకరణ వరకు ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు.మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కవిత పార్టీతో పాటు రేపు ఎన్ని పార్టీలు వచ్చిన కాంగ్రెస్‌కి తిరుగులేదన్నారు.కేసీఆర్ చుట్టూ గుంట నక్కలు ఉన్నాయా? పంది కొక్కులు ఉన్నాయా? పదేళ్లలో కవిత కి తెలియదా?అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.కేటీఆర్ గురించి కవితకే ఎక్కువ తెలుసని కేటీఆర్ రాజకీయం తెలియదని కవిత వ్యాఖ్యల్లో నిజం ఉండొచ్చన్నారు రాజకీయాల్లో ఆశ ఉండాలి,కానీ అత్యాశ ఉండకూడదన్నారు.

# పార్టీ ఏర్పాటుతో నయా జోష్
## భారీ ర్యాలీతో సత్తా చాటిన కవిత అభిమానులు

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటుతో కార్యకర్తలు, అభిమానుల్లో నయా జోష్ వెల్లివిరిసింది. శనివారం మేడ్చల్ జిల్లా అద్వయ కన్వెన్షన్‌లో జరిగిన పార్టీ ఆవిర్భావ సభకు తెలంగాణ నలుమూలల నుంచి జాగృతి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 1,500 బస్సులు, 2 వేలకు పైగా ఇతర వాహనాల్లో మునీరాబాద్‌కు చేరుకున్నారు. సుమారు 40 వేల మంది కార్యకర్తలు తరలిరావడంతో సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. సభ అనంతరం కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. పార్టీ ప్రకటన అనంతరం కేడర్‌తో కలిసి కల్వకుంట్ల కవిత భారీ ర్యాలీగా హైదరాబాద్‌కు తిరిగివచ్చారు.ఉదయం ఆమె ఇంటి వద్దే సందడి మొదలైంది. ఇంట్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సర్వమత పెద్దలు, అత్తా మామల వద్ద ఆశీర్వాదాలు తీసుకొని ర్యాలీగా బయలుదేరారు. ముందుగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా కాన్వాయ్‌తో సభా స్థలికి చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అప్పటికే సభా వేదిక, కన్వెన్షన్ పరిసరాలు హోర్డింగులు, కటౌట్లతో నింపేశారు. ప్రత్యేక బృందాలు తెలంగాణ జానపదులను ప్రదర్శించి అలరించాయి. కోలాటాలు, బతుకమ్మ ఆటలు ఆకట్టుకున్నాయి. మరోవైపు ర్యాలీగా వెళ్లిన కవితకు దారి వెంట పౌరులు కేరింతలు కొట్టి విషెస్ తెలిపారు. సభలో పార్టీ పేరును ప్రకటించిన సమయంలో కన్వెన్షన్ ప్రాంగణం హోరెత్తిపోయింది. టీఆర్ఎస్ అని ప్రకటిం చగానే... ప్రాంగణం దద్దరిల్లిపోయింది. కవిత మాట్లాడుతున్నంత సేపు హాలు చప్పట్లతో మార్మోగిపోయింది. కేకలు, విజిల్స్ మార్మోగి పో యాయి.



కార్యకర్తలు ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్‌కు కత్తి, గద బహుకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అయిదు హామీలు ఇచ్చిన నేపథ్యంలో కవిత పాంచజన్య పూరించడం విశేషం.

## ట్రాక్టర్ స్టీరింగ్ చేబట్టి.. దుక్కిదున్నిన మంత్రి జూపల్లి



**కొల్లాపూర్ (మెట్రో న్యూస్ ):** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం పొలం బాట పట్టారు. ఖరీఫ్ సీజన్ ముంగిట, తన సొంత వ్యవసాయ క్షేత్రంలో రైతు అవతారమెత్తి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. స్వయంగా ట్రాక్టర్‌ను నడుపుతూ పొలాన్ని దున్ని, విత్తనాలు వేసేందుకు నేలను సిద్ధం చేశారు. రైతుల కష్టాలు తనకు తెలుసని, రైతు దేశానికి వెన్నెముక అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు. సేద్యాన్ని లాభసాటిగా మార్చే సమగ్ర వ్యవసాయ విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు.

## మైనార్టీ విభాగం చైర్మన్‌గా మహమ్మద్ ఇర్ఫాన్ ప్రమాణం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** ప్రకాశం హాల్‌లో టీపీసీసీ మైనారిటీ విభాగం చైర్మన్‌గా మహమ్మద్ ఇర్ఫాన్ అలీ పదవీ ప్రమాణం చేశారు.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరు కాగా ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, మంత్రి అజారుద్దీన్, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్‌లు, కార్పొరేషన్ చైర్‌పర్సన్‌లు, అలాగే పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ డే వేడుకల్లో మంత్రి అజారుద్దీన్




**హైదరాబాద్, (మెట్రో న్యూస్ ):** తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ వెల్ఫేర్ మరియు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఐఏఎషాప్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలోని అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ డే శుభాకాంక్షలు తెలియజేసి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.ప్రతి సంస్థ విజయవంతంగా నడవడంలో అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు.వారు కేవలం సహాయక సిబ్బంది మాత్రమే కాదని, ప్రతి విజయవంతమైన వ్యవస్థకు వెన్నెముకలాంటివారని పేర్కొన్నారు. నాయకత్వం మరియు అమలు వ్యవస్థల మధ్య వారే వారధిలా పనిచేస్తారని, వారి నిశ్శబ్ద సేవల వల్లే సంస్థలు బలంగా, స్థిరంగా నిలుస్తాయని అన్నారు.ఈరోజు వేగంగా మారుతున్న ప్రపంచంలో చురుకుదనం విజయానికి ముఖ్యమని మంత్రి తెలిపారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండటం, కొత్త పరిస్థితులకు అలవాటు పడటం, సాంకేతికతను స్వీకరించడం, సమస్యలను తెలివిగా పరి ష్కరించడం నిజమైన నైపుణ్యమని చెప్పారు.కేవలం కష్టపడి పని చేయడం మాత్రమే కాకుండా, తెలివిగా పని చేయడం, సమన్వయంతో ముందుకు సాగడం, జట్టుగా పని చేయడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని అన్నారు.

వెనుకనుంచి కష్టపడే ప్రతి ఉద్యోగి విజయానికి భాగస్వామేనని పేర్కొన్నారు.మహిళల సాధికారతపై మాట్లాడుతూ, మహిళలు కుటుంబాలనే కాకుండా పరిపాలన, నాయకత్వం, సమాజ భవిష్యత్తును నిర్మిస్తున్నారని కొనియాడారు. మహిళల పట్టుదల, కృషి, ప్రతిభ సమాజానికి ఆదర్శమని తెలిపారు.క్రీడల అనుభవాన్ని ప్రస్తా విస్తూ, విజయం ఒక్క నాయకుడి వల్ల కాకుండా ప్రతి సభ్యుడు కట్టు బాటుతో పనిచేసినప్పుడే సాధ్యమవుతుందనిచెప్పారు.అదేవిధంగా అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ కూడాప్రతిసంస్థలో నిజమైనఛాంపి యన్లని అన్నారు.ప్రతి సంస్థలోగౌరవం,ప్రతిభ, గుర్తింపు కలిగిన వాతావర ణాన్ని నిర్మించాలని మంత్రి పిలుపునిచ్చారు.పరిపాలనా నిపుణుల సేవలు నిశ్శబ్దంగా కనిపించినా,వారిప్రభావం ప్రతిచోటాఉంటుందని అన్నారు.

## మంత్రి పొన్నంచే బీసీ స్టడీ సర్కిల్ థీమ్ సాంగ్ రిలీజ్



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** బీసీ స్టడీ సర్కిల్ థీమ్ సాంగ్ ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు విడుదల చేశారు ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కల ఆలోచన మేరకు రాజీవ్ అభయ హస్తంతో సివిల్స్ రాస్తున్న వారికి ఆర్థిక సహకారమ్ ప్రజా పాలన ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం నుండి సరైన శిక్షణ పొంది అత్యధికంగా సివిల్స్ ర్యాంకులు సాధించాలని ఆయన కోరారు.బీసీ స్టడీ సర్కిల్‌లో 100 మందికి పైగా సివిల్స్ ప్రిలిమినరీ మే 24 వ తేదీ పరీక్షలు రాసే వారి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు మోటివేషనల్ థీమ్ సాంగ్ రిలీజ్ చేయడం జరిగిందని తెలిపారు.బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించడానికి బీసీ స్టడీ సర్కిల్ థీమ్ సాంగ్ రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు.పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత ఆత్మస్థైర్యంతో సాధించాలని లక్ష్యంతో ముందుకు పోవాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్ , గ్రూప్స్, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు లో ఉన్నత అధికారులుగా పొందే అవకాశాన్ని జారవిడవకుండా శ్రమపడాలని ఆయన ఆకాంక్షించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పదోన్నతి అధికారులు





**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పదోన్నతి పొందిన పోలీస్ అధికారులు కలిశారు. ఐసీసీసీలో వారు మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో డీజీపీ ర్యాంక్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు ,స్వాతి లక్రా,మహేష్ భాగవత్,చారుసిన్హా, డా. అనిల్ కుమార్ , వి.సి. సజ్జనార్‌లు ఉన్నారు.







## గవర్నర్ నిర్ణయం పై పలువురి హర్షం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తీసుకున్న నిర్ణయం పై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రంధాలయ చైర్మన్ రియాజ్ లు హర్షం వ్యక్తం చేశారు. అజారుద్దీన్, కోదండ రామ్ లకు ఎమ్మెల్సీ పదవులు రావడం ద్వారా శాసన మండలి చర్చలు ప్రజా ప్రయోజనంగా మారుతాయని వారు పేర్కొన్నారు.

మెట్రో
హైదరాబాద్,
ఆదివారం,
ఏప్రిల్ 26, 2026





## యుద్ధం కోసం రోజుకు రూ. 9,400 కోట్ల ఖర్చు చేస్తున్న యూఎస్

ఇంటర్నెట్ డెస్క్:అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం అగ్రరాజ్యం ఖజానాను ఖాళీ చేస్తోంది. తాజా నివేదికల ప్రకారం, ఈ పోరాటం కోసం అమెరికా రోజుకు సగటున ఒక బిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.9,400 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇప్పటివరకు జరిగిన మొత్తం పోరాటంలో దాదాపు 35 బిలియన్ డాలర్లు హారతి కర్పూరంలా కరిగిపోయినట్లు అంచనా. క్షిపణుల ప్రయోగం, యుద్ధ విమానాల ఇంధనం, సైనిక మోహరింపు మరియు నిఘా వ్యవస్థల నిర్వహణ కోసం ఇంత భారీ మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఇది అమెరికా బడ్జెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ యుద్ధంలో అమెరికా తన దగ్గర ఉన్న అత్యంత ఖరీదైన మరియు అధునాతన ఆయుధాలను ఉపయోగిస్తోంది.

## ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే

### కవిత కొత్త టీఆర్ఎస్‌పై బీఆర్ఎస్ సెటైర్!

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పార్టీకి (తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అని పేరు పెట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఈ మేరకు బీఆర్ఎస్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ సెటైరికల్ పోస్టు పెట్టింది. కోల్‌గేట్ టూత్‌పేస్ట్,బిస్లేరి వాటర్ బాటిల్‌కు సంబంధించి ఒరిజినల్, నకిలీ ఉత్పత్తుల ఫొటోలను పక్కపక్కనే జోడించింది. దీనికి ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే! అనే క్యాప్షన్‌ను జత చేసింది.కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెట్టుకున్నప్పటికీ, తామే అసలైన పార్టీ అని బీఆర్ఎస్ ఈ పోస్టు ద్వారా పరోక్షంగా స్పష్టం చేసింది. తమ పార్టీ బ్రాండ్‌కే ప్రజల్లో ఆదరణ ఉంటుందని, కొత్తగా వచ్చిన పార్టీకి కాదని చెప్పకనే చెప్పింది. రాష్ట్రంలో అసలైన తెలంగాణ వాద పార్టీ తమదేనని చాటుకునే ప్రయత్నం చేసింది.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నుంచి ఈ స్పందన వచ్చింది. దీంతో టీఆర్ఎస్ పేరు చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.




# పాంచజన్యం పూరించిన కవిత

ఉచిత విద్య
ఉచిత వైద్యం
వ్యవసాయం
4 లక్షల ఉద్యోగాలు
సామాజిక న్యాయం

అమ్మగా, తల్లిగా వస్తున్నా
ఆదరించండి
నాడు మన కేసీఆర్
నేడు మర కేసీఆర్

పార్టీ పేరు
తెలంగాణ
రాష్ట్ర సేన






హైదరాబాద్ (మెట్రో న్యూస్): కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించించారు. పార్టీ పేరు టీఆర్ఎస్ అని ప్రకటించారు. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడానికి తెలంగాణ రాష్ట్ర సేన పేరిట కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరమనిషిగా పోల్చిన కవిత... కర్కోటకుడిగా పాలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ హిట్లర్ అని నిప్పులు చెరిగారు. శనివారం మేడ్చల్ జిల్లా అద్వయ కన్వెన్షన్‌లో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో కవిత ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. కాళేశ్వరం అవినీతిని ప్రశ్నించినందుకు తనను బయటకు పంపారన్నారు. మన టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పాంచజన్యం హామీలను అమలు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సింగిల్ నోటిఫికేషన్‌తో 4 లక్షల ఉద్యోగాలిస్తామన్నారు. నినిరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత కర్కోటకుడిగా... హిట్లర్‌గా వ్యవహరిస్తున్నారని కవిత మండిపడ్డారు. తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తున్నా... 8 ఎంపీ సీట్లు గెల్చుకున్న బీజేపీ వాళ్లు చేష్టలుడిగి చూస్తోందన్నారు. ఉద్యమంలో వ్యతిరేకంగా పనిచేసిన వాళ్లంతా కేసీఆర్ పంచన చేరిపోయి తెలంగాణను మరోసారి మోసం చేశారన్నారు. అందుకే అధికారమే లక్ష్యంగా తమ టీఆర్ఎస్ ఉద్యమిస్తుందని... అర్జునుడి శంఖం పాంచజన్య స్ఫూర్తిగా 5 హామీలను ప్రస్తుతించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక తెలంగాణ హామీలను అమలుచేసి తెలంగాణను అగ్రగామిగా నిలబెడతామన్నారు. నినివేలాదిగా విచ్చేసిన జాగృతి కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో... సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కొత్త పార్టీ ఆవిర్భావ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. తెలంగాణ ఉద్యమ పోరాటం... ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం... బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులపై మాట్లాడిన కల్వకుంట్ల కవిత... గులాబీ పార్టీని, అధికార కాంగ్రెస్, అలాగే బీజేపీ పార్టీలను తూర్పారబట్టారు. ముఖ్యంగా గులాబీ బాస్ కేసీఆర్‌పై మాటల తూటాలు పేల్చారు. ఉద్యమ కేసీఆర్... అధికారం చేపట్టిన కేసీఆర్... ఒక్కరు కారని తేల్చారు. గుంటనక్కలు, తోడేళ్లు, పందికొక్కులను పక్కనబెట్టుకొని ఆత్మలేని కేసీఆర్‌గా మారిపోయారని... దేనికీ స్పందించకుండా చలనంలేని మరమనిషిగా మారిపోయారని వ్యాఖ్యానించారు.

# అజార్‌కు తప్పిన పదవీ గండం

## ఎమ్మెల్సీ ఫైలుపై గవర్నర్ సంతకం కోదండరామ్‌కూ లైన్ క్లియర్



హైదరాబాద్ (మెట్రో న్యూస్): రాష్ట్ర మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్‌కు పదవీ గండం తప్పింది. ఈనెలాఖరులోపు ఆయన ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయని పక్షంలో తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది! అయితే శనివారం నాడు రాష్ట్ర గవర్నర్ శుక్లా... పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైలుపై సంతకం చేశారని లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. దీంతో అజహరుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్‌లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ అధికారిక గెజిట్ విడుదల కానుంది. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశమవ్వడం తెల్సిందే. ఈనెలాఖరులోపు ఎమ్మెల్సీ కాని పక్షంలో మంత్రి పదవిని చేజార్చుకునే పరిస్థితిపై సీఎం ఈ సందర్భంగా గవర్నర్‌కు విన్నవించారు. ఇద్దరు ఎమ్మెల్సీల నియామకాలను వీలైనంత త్వరగా ఆమోదించాలని కోరారు. ముఖ్యమంత్రి కలిసిన వారం రోజుల్లో గవర్నర్ బంగ్లా నుంచి ప్రభుత్వానికి, మంత్రి అజహర్‌కు శుభవార్త అందింది.



## నిన్న ఆర్టీసీ డ్రైవర్లు.. ఇవాళ ఆటో డ్రైవర్లు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్ నగరంలో ఆటో డ్రైవర్లు ఒక్కసారిగా రోడ్డెక్కారు. నిన్న ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళనలు కొనసాగగా, నేడు ఆటో డ్రైవర్లు తమ డిమాండ్ల సాధన కోసం ఎంజే మార్కెట్ చౌరస్తాను ముట్టడించారు. ఈ నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

**ఆత్మహత్యాయత్నం చేసిన డ్రైవర్**

నిరసన తీవ్రత ఎంతలా ఉందంటే.. ఒక ఆటో డ్రైవర్ తనపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. తోటి డ్రైవర్లు, పోలీసులు వెంటనే స్పందించి అతడిని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

**ప్రధాన డిమాండ్లు ఇవే**

నగర ఆటో డ్రైవర్లు ప్రధానంగా రెండు అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు:
ఆటో మీటర్లపై ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.
జిల్లా పర్మిషన్ ఉన్న ఆటోలతో పాటు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారు నగరంలో ఆటోలు నడుపుతుండటం వల్ల స్థానిక డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆటోలకు నగరంలో అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్ జామ్: వాహనదారుల అవస్థలు**

గంటకు పైగా ఎంజే మార్కెట్ చౌరస్తాలో ధర్నా కొనసాగడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేస్తున్నారు.

## కిక్కిరిసిన కేదార్‌నాథ్



రుద్రప్రయాగ్: ఛార్‌థామ్ యాత్రలో భాగమైన కేదార్‌నాథ్‌కు భక్తులు పోటెత్తారు. జ్యోతిర్లింగాన్ని దర్శించుకునేందుకు జనం ఎగబడుతున్నారు. ఆలయాన్ని ఓపెన్ చేసిన తొలి మూడు రోజుల్లోనే సుమారు 90 వేల మంది భక్తులు కేదార్‌నాథ్ చేరుకున్నారు. దీంతో కేదారీశ్వరుడి దర్శనం ఆలస్యం అవుతున్నది. బుధవారమే కేదార్‌నాథ్ ఆలయాన్ని ఓపెన్ చేసిన విషయం తెలిసిందే. రుద్రప్రయాగ్ ఎస్పీ నిహారిక తోమర్ మాట్లాడుతూ.. భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నట్లు వెల్లడించారు.

ఏప్రిల్ 22వ తేదీన మొదటి రోజు సుమారు 38 వేల మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నట్లు చెప్పారు. రెండో రోజు 25 వేల మంది, మూడో రోజు 30 వేల మంది యాత్రికులు కేదార్‌నాథ్ చేరుకున్నారు. కేదార్‌నాథ్ థామ్‌లో భద్రత కట్టుదిట్టంగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. రాష్ట్ర పోలీసులతో కేంద్ర పారామిలిటరీ బలగాలను కూడా మోహరించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఎమర్జెన్సీ దళాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.జిల్లా మెజిస్ట్రేట్ విశాల్ మిశ్రా ఆలయ పరిసరాల్లో పర్యవేక్షణ చేశారు. ట్రావెల్ అప్‌డేట్స్ గురించి పోలీసు, అడ్మినిస్ట్రేషన్ విభాగం అందించే సమాచారాన్ని మాత్రమే భక్తులు ఫాలోకావాలన్నారు.

## స్కిల్ వర్సిటీ సేవలను వినియోగించుకోవాలి

విక్రం-1 రాకెట్ ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీకి చెందిన విక్రం-1 రాకెట్ ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం నాడు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీని పరిశీలించారు. కంపెనీ యాజమాన్యాన్ని ప్రశంసించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏరో స్పేస్ విభాగంలో కూడా స్కిల్ యూనివర్సిటీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఏరో స్పేస్ రంగానికి కావాల్సిన మనవ వనరులను యూనివర్సిటీ ద్వారా అందిస్తామన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డు చైర్మన్‌గా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

## అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తమ్ముడు

మంథని,(మెట్రో న్యూస్) : తల్లిని ఇంట్లోకి రానివ్వడం లేదని ఆగ్రహంతో అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం లక్కేపూర్ గ్రామంలో జరిగింది. నిద్రిస్తున్న అన్న రఘుపై తమ్ముడు అనిల్ కిటికీలోంచి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో మంటలు చెలరేగి రఘుకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని వరంగల్లోని ఎంజీఎంకు తరలించారు.

## బాల్య వివాహాన్ని ఆపడానికి వెళ్లి.. పెళ్లికూతురు చెల్లిని తీసుకెళ్లిన అధికారులు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): గద్వాల జిల్లాలో ఐసీడీఎస్, పోలీసు అధికారుల నిర్వాకం ఒక మైనర్ బాలిక జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టింది. ఒక చిన్న పొరపాటు వల్ల జరగాల్సిన వివాహం ఆగిపోవాల్సింది పోయి, ఆ పెళ్లి సైలెంట్ గా జరిగిపోయింది. అధికారుల కళ్లు గప్పి పెద్దలు పెళ్లి జరిపించేశారు.ధరూర్ మండలానికి చెందిన యువకుడికి, గద్వాల మైనర్ బాలికకు గత బుధవారం రాత్రి వివాహం జరగబోతోంది. బాల్య వివాహం గురించి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు బుధవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. కానీ, అధికారులు వస్తున్నారన్న సమాచారంతో పెళ్లి కూతురును అప్పటికే పెద్దలు అక్కడి నుంచి తప్పించారు. అక్కడకు వచ్చిన అధికారులు.. అక్కడ ఉన్న పెళ్లి కూతురు చెల్లినే వధువుగా భావించి... కనీసం ఆధార్ కార్డులోని ఫొటోను కానీ, పెళ్లి పత్రికలోని పేరును కానీ సరిపోల్చుకోకుండా ఆమెను సంరక్షణ కేంద్రానికి తరలించారు. తన చిన్న కూతురిని అధికారులు తీసుకెళ్తుంటే పెళ్లికూతురు తల్లిదండ్రులు, పెద్దలు సైలెంట్‌గా ఉండిపోయారు.

కృషితోనాస్తి దుర్భిక్షం
మెట్రో ఈవినింగ్స్
4, హైదరాబాద్ ఆదివారం ఏప్రిల్ 26, 2026

# రాజకీయమే దక్షిణాదికి శాపం !

దక్షిణాదికి అన్యాయం పేరుతో కాంగ్రెస్ కూటమి పార్టీలు డిలిమిటేషన్ బిల్లును వీగిపోయేలా చేశారు. ఈ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా విజయం సాధించామని సంబరాలు చేసుకుంటున్న పార్టీలు , అసలు సమస్యకు పరిష్కారం చూపే విషయంలో మాత్రం మోనాన్ని ఆశ్రయించాయి. దక్షిణాదికి అన్యాయం జరిగిందని గొంతు చించుకుంటున్న ఈ పార్టీలు, ఆ అన్యాయాన్ని ఎలా సరిదిద్దాలి? ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య ఉండాల్సిన సీట్ల నిష్పత్తి ఎం? ఏ ప్రాతిపదికన సీట్లను కేటాయిస్తే సమాఖ్య స్ఫూర్తి వర్ధిల్లుతుంది? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. దక్షిణాదికి ఎంత ప్రాధాన్యం ఇస్తే న్యాయం చేసినట్లో ఎవరు చెబుతారు?. ఏం చేసినా ప్రజల్ని రెచ్చగొట్టడమే రాజకీయం స్వతంత్ర భారత దేశంలో నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకు నాలుగు సార్లు 1952, 1963, 1973, 2002 డీలిమిటేషన్ కమిషన్లను ఏర్పాటు చేశారు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనాభా గణన ఆధారంగా లోక్ సభ స్థానాలను పునర్వ్యవస్థీకరించాలని రాజ్యాంగంలోని అధికరణ 82 నిర్దేశిస్తోంది. దీని ప్రకారం, చివరగా 1971 జనాభా గణన ఆధారంగా 1973లో లోక్ సభ సీట్ల సంఖ్యను 543కు పెంచారు. అప్పట్లో ఒక ఓటు – ఒకే విలువ అనే సూత్రంతో, దేశవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో దాదాపు సమాన సంఖ్యలో జనాభా ఉండేలా సీట్లను కేటాయించారు. 1970వ దశకంలో కేంద్ర ప్రభుత్వం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను తీవ్రతరం చేసింది. దక్షిణాది రాష్ట్రాలు ఈ కార్యక్రమాలను క్రమశిక్షణతో అమలు చేసి జనాభాను నియంత్రించగా, ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల కొనసాగింది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, కుటుంబ నియంత్రణ పాటించిన రాష్ట్రాలు పార్లమెంటులో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ అన్యాయాన్ని నిరోధించడానికి 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 2001 వరకు సీట్ల పెంపుపై నిషేధం విధించింది. అంటే, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయ శిక్ష పడకుండా రక్షణ కల్పించారు. 2001లో నిషేధం గడువు ముగిసిన తర్వాత, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం 84వ రాజ్యాంగ సవరణను తీసుకువచ్చింది. దీని ప్రకారం, నియోజకవర్గాల సరిహద్దులను మార్చడానికి అనుమతించారు కానీ, మొత్తం సీట్ల సంఖ్యను మాత్రం పెంచలేదు. 1971

## //ఎడిటోరియల్//

జనాభా లెక్కలనే ప్రాతిపదికగా కొనసాగిస్తూ, సీట్ల పెంపుపై నిషేధాన్ని మరో 25 ఏళ్ల పాటు అంటే 2026 వరకు పొడిగించారు. దీనివల్ల 2002–2008 మధ్య జరిగిన పునర్విభజనలో కేవలం రాష్ట్రాల లోపల నియోజకవర్గాల సరిహద్దులు మాత్రమే మారాయి తప్ప, లోక్ సభలో రాష్ట్రాల బలాబలాలు మారలేదు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం, 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణన ఆధారంగా కొత్త పునర్విభజన జరగాలి. ఇప్పుడు జనగణన ప్రారంభమయింది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గుతాయి. 1971లో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు దేశ జనాభాలో దక్షిణాది వాటా దాదాపు 25 శాతంగా ఉండేది. అప్పట్లో ఉత్తరాది రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు కూడా నియంత్రణలోనే ఉండేది. కానీ, గడిచిన ఐదు దశాబ్దాల్లో పరిస్థితి తలకిందులైంది. నేడు 2025 నాటికి దక్షిణాది జనాభా వాటా 18 శాతానికి పడిపోగా, ఉత్తరాది రాష్ట్రాల వాటా గణనీయంగా పెరిగింది. ఈ జనాభా అసమతుల్యతనే ప్రాతిపదికగా తీసుకుంటే, రాబోయే పునర్విభజనలో దక్షిణాది సుమారు 100 సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆర్థిక కోణంలో విశ్లేషిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రగతి అబ్బురపరుస్తుంది. 1971 నాటి దేశ స్థూల జాతీయోత్పత్తి లో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉండేది. కానీ నేడు 2025–26 ఆర్థిక సంవత్సర అంచనాల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు 31 శాతం పైగా జీఎస్‌డీపీని అందిస్తున్నాయి. అంటే, దేశానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న రాష్ట్రాలు ఇవే. పశ్చిమ భారత రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్ కూడా తన జీఎస్‌డీపీ వాటాను 15 శాతం నుండి 21 శాతానికి పెంచుకుంటూ వస్తోంది. కానీ, ఉత్తరాదిలోని ప్రధాన రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి చోట్ల జనాభా విస్ఫోటనం జరిగినా, దేశ ఆర్థిక వ్యవస్థకు అవి ఇచ్చే వాటా జనాభా నిష్పత్తిలో పెరగలేదు.

## తలరాతలు

మెట్రో డైలీ

ఏ పాళీతో రాసాడో తల రాతల్ని పైవాడు..
సంతోష క్షణాలు క్షణమైనా నిలవడం లేదు !
కలియుగంలో అవినీతి పరుగుతో పోటీలో..
నీతి నిజాయితీ సదా వెనకబడుతోంది !
ధనం, జీవితం, అందం శాశ్వతం కావు..
తాత్కాలికమైన వాటి వెనుక పరుగు తీయకు !
నీ విజయం మరొకరిలో ఈర్ష్య రగిలిస్తుంది..
నీ అడుగుల్లో కాళ్లు అడ్డుపెట్టే వారెందరో ఉన్నారు !
కళ్లు మూసుకొని నమ్మిన మన ఆప్త బంధువులే..
ఓ రోజు మన కళ్లు తెరిపిస్తారు జర జాగ్రత్త నేస్తం !
హద్దులు మీరిన అతి ప్రేమలు చూపితే..
ఏదో ఒక రోజు కన్నీటి వరదలను పారిస్తాయి !
ఆస్తులు పెరిగితే నీ కళ్లు మసకబారుతాయి..
నిన్నటి నీ వాళ్లు నేడు నీ జ్ఞాపకాల్లో లేరు కదా !

–మధుపాళీ, 9949700037

## తెలుసుకో..!

లోకాన్ని అర్థం చేసుకోవాలనుకుంటే..
ఎదుటి వారి బాధల్ని తెలుసుకో
త్యాగం చేయాలనుకుంటే
అహంకార స్వార్థాల్ని వదిలేసుకో !
దేవుడినే నిమజ్జనం చేసే మనిషి..
తన స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తాడు !
నీవు మంచోడివి అంటారందరూ..
అందుకేనేమో అందరూ ఆడుకుంటున్నారు !
బరువు మోయడానికి ఇబ్బంది పడతారు..
నీ జ్ఞాపకాల బరువుకు నేను కుంగి పోతున్నాను !
మంచోడనిపిచ్చుకోవాలంటే
పరహిత భావనలు అలవర్చుకో !
జీవితం సంక నాకాలంటే..
మానవీయ విలువలకు తిలోదకాలిచ్చుకో !

మెట్రో డైలీ

–మధుపాళీ, 9949700037

# మలేరియా రహిత భారతాన్ని నిర్మించలేమా !




## మెట్రో తెలంగాణ చావడి






ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల ప్లాస్మోడియం అనబడే పరాన్న సుక్ష్మ జీవి మానవ రక్తంలోకి చేరి మలేరియా వ్యాధికి కారణం అవుతుంది. చికిత్సను అశ్రద్ధ చేయడం ప్రాణాంతకం కూడా కావచ్చు. ప్రపంచాన్ని వణికించిన ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా కూడా ఒకటి. నేటికీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మలేరియా వ్యాధి పేద బడుగు బలహీన వర్గాలను పట్టి పీడిస్తున్నది, ప్రాణాలను సహితం తీస్తున్నది. అధ్యయన వివరాల ప్రకారం ప్రతి ఏట ప్రపంచవ్యాప్తంగా 229 మిలియన్ల కొత్త మలేరియా కేసులు బయట పడుతున్నాయి. నేడు ఐరాస గుర్తింపు పొందిన మలేరియా రహిత దేశాల జాబితాలో జపాన్, యూఏఈ, శ్రీలంక లాంటి దాదాపు 45 దేశాలు సగర్వంగా కనిపిస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సహితం దాదాపు వందకు పైగా దేశాల 3.3 బిలియన్ల ప్రజలు మలేరియా అంచున కొట్టుమిట్టాడుతుండడం విచారకరం. ఆఫ్రికా దేశాల్లోనే 93 శాతం మలేరియా కేసులు, 94 శాతం మలేరియా మరణాలు నమోదు అవుతున్నట్లు అంచనా. ని నిప్రపంచ మలేరియా దినం–2026 ఇతివృత్తం:ని ఐరాస నాయకత్వంలో 2007 నుంచి ప్రతి ఏట 25 ఏప్రిల్ రోజున "ప్రపంచ మలేరియా దినం (వరల్డ్ మలేరియా డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. వరల్డ్ మలేరియా డే–2026 ఇతివృత్తంగా "మలేరియా అంతానికి చర్యలు : ఇప్పుడు చేయగలం, ఇప్పుడు మనం తప్పక" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి మలేరియా వ్యాధి నిర్ధారణ, మెరుగైన చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగ నిర్మూలన వంటి ఇతర విషయాల్లో వచ్చిన విప్లవాత్మక సానుకూల మార్పులతో మలేరియా నుంచి ప్రజలను కాపాడడం తేలిక అయ్యింది. గత రెండు దశాబ్దాలుగా 7 మిలియన్ల మలేరియా వ్యాధిగ్రస్థులను కాపాడడంతో పాటు ఒక బిలియన్ ప్రజలకు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం విజయవంతంగా జరిగింది. ప్రపంచ దేశాలను "జీరో మలేరియా" దేశాలుగా ప్రకటించడానికి కావలసిన కృషి నిరంతరం కొనసాగుతున్నది. నినిమలేరియా నియంత్రణ జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు: మలేరియా నిర్మూలన సదుద్దేశంతో ప్రపంచ దేశాలు వడి వడిగా సరైన దిశలో అడుగులు వేయడం, మలేరియాను నియంత్రించడం, మరణాలకు అడ్డుకట్ట వేయడం ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా జరుగుతోంది. మలేరియా కట్టడికి పౌర సమాజంతో పాటు ప్రభుత్వాలు కూడా నడుం బిగిస్తేనే ప్రయోజనం ఉంటుందని గమనించాలి. దోమల నిర్మూలన, పరిసరాల శుభ్రత, వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, నిధుల కేటాయింపు, సామాన్య ప్రజలకు అవగాహన లాంటి చర్యలతో మలేరియా నియంత్రణ సుసాధ్యం కావడం మన అనుభవంలోకి వస్తున్నది. మలేరియా వ్యాధి లక్షణాల్లో జ్వరం, చలి వణుకు, చెమట, తల నొప్పి, అలసట, కండరాల కీళ్ల నొప్పులు, వాంతులు, రక్తహీనత, దగ్గు, కడుపు నొప్పి లాంటివి ఉన్నాయి. డిజిటల్, ఏఐ–ఎంఎల్ యుగంలో వేగంగా దూసుకుపోతున్న నవ్య మానవుడు దోమకాటు కారణంగా వచ్చే మలేరియా కోరల్లో చిక్కుకోవడం సోచనీయం. దోమకాటు బారినపడకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సోకినపుడు వెంటనే వైద్య చికిత్స తీసుకోవడం మన కనీస కర్తవ్యం. ఈ విషయంలో పౌరులు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ చర్యలు లాంటివి సమాంతరంగా జరిగితేనే భారతం మలేరియా రహిత దేశాల జాబితాలో చేరుతుందని తెలుసుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# వైశాఖ మాసంలో మహా శుభం– పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాల వైభవం!

అత్యంత పవిత్రమైన వైశాఖ మాసం విశిష్టత– ఈ మాసంలో జరిగే పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు– ఈ ఉత్సవాలను వీక్షించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని నమ్మకం!

తెలుగు పంచాంగం ప్రకారం మాసములలోకెల్లా వైశాఖ మాసం ఎంతో పవిత్రమైనదని పెద్దలు అంటారు. ఈ మాసంలో చేసే పుణ్యకార్యాలు, దానధర్మాలు విశేషమైన ఫలితాన్ని ఇస్తాయని అంటారు. ముఖ్యంగా వైశాఖ మాసంలో కన్యాదానం చేయడం కోటి అశ్వమేధ యాగాలు చేసిన దానితో సమానమని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇదే మాసంలో ఆకాశరాజు తన కుమార్తె పద్మావతి దేవిని శ్రీనివాసునికి ఇచ్చి పరిణయం జరిపించినట్లు వేంకటాచల మహత్యంలో వివరించి ఉంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు వైశాఖ మాసంలో పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ రావడం విశేషం. ఈ సందర్భంగా తిరుమల నారాయణవనంలో జరుగనున్న పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాల విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఎప్పటి నుంచి?**

ఏప్రిల్ 25, శనివారం నుంచి నారాయణవనంలో మూడు రోజులపాటు శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఈ పరిణయోత్సవాలు ఎందుకు జరుపుతారు? ఎలా జరుపుతారు? ఈ ఉత్సవాల విశిష్టత ఏమిటి? అనే విషయాలు తెలుసుకుందాం.

**ఎవరీ పద్మావతీదేవి?**

ఆకాశరాజు యాగం చేయదలచి భూమి దున్నుతుండగా సహస్ర దళములు గల ఒక పద్మము నందు పద్మావతీదేవి అయోనిజగా ఉద్భవించింది. ఆకాశరాజు ఆ పసిపాపకు పద్మావతి అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. యుక్తవయసు వచ్చాక పద్మావతి షోడశ కళలతో ప్రకాశించే సౌందర్యవతిగా మారింది.

**శ్రీనివాసునితో తొలి పరిచయం**

ఒకనాడు పద్మావతి నారాయణవనంలో విహరించడానికి చెలికత్తెలతో కలిసి వెళ్లింది. అదే సమయంలో శ్రీనివాసుడు ఒక మద గజమును వేటాడుతూ ఆ వనం సమీపానికి చేరుకున్నాడు. ఆ సమయంలో శ్రీనివాసుడు పూలవనంలో విహరిస్తున్న పద్మావతిని చూసి, ఆమె చెలికత్తెలతో ఈ సౌందర్యరాశి ఎవరు? అని ప్రశ్నించి తన గోత్రనామాలు వారితో చెప్పి తన గురించి పద్మావతికి వివరించమని చెప్పాడు. అప్పుడు పద్మావతితో పాటు ఆమె చెలికత్తెలు కూడా శ్రీనివాసునిపై ఆగ్రహించి అతన్ని అక్కడ నుంచి పంపేశారు.

**శ్రీనివాసునిపై మరలుగొన్న పద్మావతి**


చెలికత్తెల ముందు గంభీరంగా ఉన్నప్పటికీ పద్మావతి శ్రీనివాసుని చూసిన తొలిచూపులోనే మనసు పడింది. అదే విషయం ఆమె తన తల్లి ధరణీదేవి వద్దకు వెళ్లి తాను శ్రీనివాసుని ఇష్టపడుతున్నానని, అతనినే పరిణయం చేసుకోవాలని ఉందని విన్నవించుకుంది.

**పద్మావతి ప్రేమలో శ్రీనివాసుడు**

ఇటు పద్మావతిని చూసి నారాయణవనం నుంచి ఇంటికి చేరుకున్న శ్రీనివాసుడు పద్మావతి విరహత్తప్తుడై, చింతాక్రాంతుడై శయనించి ఉండగా వకుళ మాత తన కుమారుని చూసి ఃఃనాయనా! నీ చింతకు కారణం ఏమిటి అనిఃః? ప్రశ్నించగా అప్పుడు శ్రీనివాసుడు నారాయణవనంలో తాను పద్మావతిని చూసిన దగ్గర నుంచి జరిగింది మొత్తం తన తల్లికి వివరించాడు. తాను పద్మావతిపై మనసు పడ్డానని, ఆమెను తప్ప మరెవ్వరినీ వివాహం చేసుకోనని చెప్పాడు. శ్రీనివాసుడు ఆకాశరాజు వద్దకు వెళ్లి తమ వివాహం గురించి మాట్లాడామని తన తల్లికి చెప్పాడు.

**ఆకాశరాజు అంతఃపురానికి వెళ్లిన వకుళ మాత**

ఇటు పద్మావతి శ్రీనివాసుని గురించి తన తల్లికి వివరిస్తున్న సమయంలోనే వకుళ మాత ఆకాశరాజు






అంతఃపురానికి చేరుకొని ధరణీదేవిని కలుసుకుంటుంది. తన కుమారుడైన శ్రీనివాసుడు నారాయణవనంలో పద్మావతిని చూసి వరించిందని చెప్పి, శ్రీనివాసుని సుగుణాలను, రూపలావణ్యాలను కన్నులకు కట్టినట్లుగా వివరిస్తుంది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఆకాశరాజు గతంలో నారద మహర్షి చెప్పిన సమయం ఆసన్నమైనది తలచి, ఆ శ్రీమన్నారాయణుడే తన తన ఇంటికి అల్లుడుగా రాబోతున్నాడని గ్రహించి పరమ సంతోషంతో తన కుమార్తె పద్మావతిని శ్రీనివాసునికి ఇచ్చి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించాడు.

**ప్రతి ఏటా పద్మావతి పరిణయోత్సవాలు**

తిరుమలలో ప్రతి ఏటా మూడు రోజుల పాటు నారాయణపురం గల ప్రత్యేక మండపాలలో పద్మావతి పరిణయోత్సవాలు టీటీడీ ఘనంగా నిర్వహిస్తుంది.

# బిల్లా-రంగా స్టైల్ స్కామ్! ఒకే వ్యక్తి రెండు పేర్లతో, ఒకే భూమికి డబుల్ రిజిస్ట్రేషన్లు







**జడ్చర్లలో భూ మాఫియా ఆటల బట్టబయలు!"**

**వెంకటమ్మ పట్టా భూమిని వంశస్థులు మండ్ల రామస్వామి, మండ్ల. యాదయ్య మరొకరికి అమ్మారని ఆరోపణ,.!**

**ఈ భూమి వ్యవహారంలో మా నాన్న కేశవులు హత్య చేశారని స్వామి ఆరోపణ...?**

మెట్రో న్యూస్ (జడ్చర్ల):జడ్చర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో వెలుగులోకి వచ్చిన భూ రిజిస్ట్రేషన్ వివాదం, సినిమా కథల్ని తలపించేలా సంచలనం రేపుతోంది. ఒకే వ్యక్తి రెండు పేర్లతో, ఒకే భూమిపై రెండుసార్లు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ఘటన బయటపడటంతో, భూ రికార్డుల భద్రత, రిజిస్ట్రేషన్ వ్యవస్థపై తీవ్ర అనుమానాలు,వ్యక్తమవుతున్నాయి. శేఖర్‌గానిపల్లి గ్రామానికి చెందిన మండ్ల వెంకటమ్మకు చెందిన సర్వే నంబర్ 888/ఆలో ఉన్న సుమారు ఒక ఎకరం భూమి (దాదాపు కోటి రూపాయల విలువ)2006లోఅనుమానాస్పదంగా రిజిస్ట్రేషన్ అయ్యిందని బాధితులు ఆరోపిస్తున్నారు.డాక్యుమెంట్ నంబర్ 6328/2006 ప్రకారం 40 గుంటలు అమ్మినట్టు నమోదు కాగా, అదే భూమిని కేవలం మూడు వారాల వ్యవధిలో డాక్యుమెంట్ నంబర్ 8595/2006 ద్వారా మరోసారి రిజిస్ట్రేషన్ చేయడం అనుమానాలకు తావిస్తోంది.ముఖ్యంగా, ఈ రెండు డాక్యుమెంట్లలో ఫోటో ఒకే వ్యక్తిదే ఉండగా, పేర్లు మాత్రం "రాజు" మరియు "భాష"గా మారడం, తండ్రి పేరు కూడా ఒకే విధంగా ఉండటం గమనార్హం. ఇది




పక్కా నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తోందని బాధితులు అంటున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ భూమికి ధరణి పోర్టల్ ద్వారా రైతుబంధు సాయం కూడా అందుతుండటం.బాధితురాలు మండ్ల వెంకటమ్మ ఈ వ్యవహారంపై జడ్చర్ల కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చాలని సూచనలు వెలువడ్డాయి. అయినప్పటికీ, ఆ ఆంక్షలను పక్కనబెట్టి మళ్లీ రిజిస్ట్రేషన్ జరగడం, వ్యవస్థలో లోపాలను బయటపెడుతోంది.

ఇదే కేసులో మరొక కీలక ఆరోపణ కూడా వెలుగులోకి వచ్చింది. భూ వివాదం నేపథ్యంలో వెంకటమ్మ భర్త కేశవులు 20 ఏళ్ల క్రితం హత్యకు గురయ్యారని, ఆ హత్య తర్వాతే ఈ భూమిపై నకిలీ,రిజిస్ట్రేషన్లు,జరిగాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుండి తమ కుటుంబంపై దాడులు,బెదిరింపులు,కొనసాగుతున్నాయని, ప్రాణభయం నడుమ జీవిస్తున్నామని వారు వాపోతున్నారు.ఇదిలా ఉండగా, రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులు మాత్రం తమకు భూమి అమ్మినవారి అసలు వివరాలు తెలియవని, మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేశామని చెబుతున్నారు. అసలు "రాజు" ఎవరు? "భాష" నిజంగా వేరే వ్యక్తేనా? లేక ఒకే వ్యక్తి ముసుగులో జరిగిందా? అనే అంశాలు ఇప్పటికీ స్పష్టతకు రాలేదు.ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ బాధ్యతపై కూడా ప్రశ్నలు లేవుతున్నాయి. ఒకే భూమిపై, ఒకే వ్యక్తి ఫోటోతో, పేర్లు మార్చి రెండుసార్లు రిజిస్ట్రేషన్ జరగడం ఎలా సాధ్యమైందనే దానిపై సమగ్ర విచారణ అవసరం ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఐడి ప్రూఫ్, ఫింగర్ ప్రింట్స్, సాక్ష్యాలు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉండగా, అవి ఎంతవరకు అమలయ్యాయో అనుమానాస్పదంగా మారింది.ఇక పోలీసుల వ్యవహారం కూడా విమర్శలకు గురవుతోంది. నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయకపోవడం, విచారణలో ఆలస్యం జరగడం బాధితుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, పారదర్శక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.మొత్తంగా, జడ్చర్లలో బయటపడిన ఈ డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారం, భూ మాఫియా ఉ అధికారుల మధ్య ఉన్న అనుబంధాలపై అనుమానాలను మరింత పెంచుతోంది. నిజాలు వెలుగులోకి వస్తాయా? బాధితులకు న్యాయం జరుగుతుందా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.

## చిన్నారులకు సాంప్రదాయ నృత్యంలో ఉచిత శిక్షణ .. ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్ రెడ్డి



మెట్రో న్యూస్ మహబూబ్‌నగర్ టౌన్ పాలమూరు ఫస్ట్ కార్యాలయంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు తమ చిన్నారులను వెంట తీసుకుని వస్తున్న నేపథ్యంలో, చిన్నారుల కోసం వేసవి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా చిన్నారులకు సాంప్రదాయ నృత్యం మరియు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లోఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణను నిష్ణాతులైన శిక్షకుల ద్వారా నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళలు తమ శిక్షణను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించగలుగుతున్నారు. అదే సమయంలో చిన్నారులు,కొత్తనైపుణ్యాలను నేర్చుకుంటూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ మరియు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, సాంప్రదాయ కళలపై ఆసక్తి కలిగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న ఈ చర్యలు అభినందనీయమని వారు తెలిపారు.

## మండలానికి ప్రత్యేక మొక్కజొన్న కేంద్రాన్ని ఏర్పాటుకు డిప్యూటీ తహసిల్దార్ కి వినతి పత్రం

మెట్రో న్యూస్:- (ఉప్పునుంతల ఏప్రిల్ 25)ఉప్పునుంతల మండలానికి ప్రత్యేక మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి అని మండల ఉప తహసిల్దార్ రమేష్ గారికి సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ ఉప్పునుంతల మండలంలో మొక్కజొన్న పంటను అధికంగా వేయడం జరిగింది.కాబట్టి కొనుగోలు కేంద్రం కూడా మండలానికి సంబంధించిన కేంద్రం ఉంటే ఆదాయం కూడా మండల అభివృద్ధికి దోహద పడుతుంది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఏఐకేఎస్ అనుబంధం మండల అధ్యక్షులు మాచర్ల కిష్టయ్య పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



జోగులాంబ గద్వాల జిల్లా (మెట్రో న్యూస్, ఏప్రిల్ 25): బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా, గుంటిపల్లి గ్రామ పంచాయతీ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సమాజంలో బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన నిబంధనలు, పిల్లల హక్కుల పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్ మాట్లాడుతూ, బాల్యవివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. చిన్న వయసులో వివాహం జరగడం వల్ల పిల్లల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ముఖ్యంగా బాలికల ఆరోగ్యం మరియు మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. బాల్యం అనేది చదువు, ఎదుగుదల, వ్యక్తిత్వ వికాసానికి కీలక దశ అని, ఆ దశలో వివాహ బంధంలోకి నెట్టడం వారి హక్కుల ఉల్లంఘనతో సమానమని తెలిపారు. అలాగే భారతదేశంలో అమల్లో ఉన్న బాల్యవివాహాల నిరోధక చట్టాల గురించి అవగాహన కల్పిస్తూ, అబ్బాయికి కనీస వివాహ వయస్సు 21 సంవత్సరాలు, అమ్మాయికి 18 సంవత్సరాలు అని గుర్తుచేశారు.ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. బాల్యవివాహాలను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, పిల్లల విద్యను ప్రోత్సహించడం ద్వారా మాత్రమే ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ శ్రీనివాసులు, లక్ష్మన్న స్వామి, సర్పంచ్ శివకుమార్, పంచాయతీ సెక్రెటరీ శశికళ, మరియు అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**స్పార్ష్ కిడ్స్ ప్లే పాఠశాల తొలి వార్షికోత్సవ వేడుకలు.**



గద్వాల ఏప్రిల్ 25 (మెట్రోన్యూస్ ):జోగులాంబ గద్వాల జిల్లాలోని స్పార్ష్ కిడ్స్ ప్లే పాఠశాల తొలి వార్షికోత్సవ వేడుకలు గద్వాల్ పట్టణంలోని మా మార్ట్ బ్యాంక్వెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండవ వార్డ్ యువ నాయకుడు సాయి శ్యామ్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదిస్తూ వారి ప్రతిభను కొనియాడారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.ముఖ్యంగా షిప్రా టీం అందించిన అద్భుతమైన నృత్య ప్రదర్శనలు సభలో ఉన్న వారందరినీ ఆకట్టుకున్నాయి.చిన్నారుల ఉత్సాహం,వారి ఆత్మవిశ్వాసం,వేదికపై చూపిన ప్రతిభ అక్కడ ఉన్న అందరినీ మెప్పించాయి.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లతా మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## జర్నలిజం ముసుగులో "అక్రిడేషన్" మాఫియా..??

**అధికారులపై బ్లాక్‌మెయిలింగ్ పర్వం..!!**

**వ్యాపార రక్షణ కవచం అక్రిడేషన్ కార్డు..??**

వీపనగండ్ల మెట్రో న్యూస్:పవిత్రమైన జర్నలిజం వృత్తిని అడ్డం పెట్టుకుని, ప్రభుత్వ అక్రిడేషన్ కార్డులను ఒక ఆయుధంగా మలుచుకుని కొందరు అక్రమార్కులు సాగిస్తున్న దందా జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వార్తలు రాయడం పక్కన పెట్టి, కేవలం తమ ప్రభుత్వ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడమే ధ్యేయంగా అధికారులను భయభ్రాంతులకు గురిచేసి గుప్పిట్లో ఉంచుకోవచ్చనే ఉద్దేశంతో మేము జర్నలిస్టులమని అక్రిడేషన్ కార్డులను పొందుతున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ యంత్రాంగమే టార్గెట్..!!**

వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించుకోవడానికి అక్రిడేషన్ కార్డును ఒక "లైసెన్స్"లా వాడుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.విధి నిర్వహణలో ఉన్న అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, తమ వ్యాపారాల్లోని అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు వార్తలతో సోషల్ మీడియాలో,పత్రికల్లో పరువు తీస్తామని బెదిరించడం పరిపాటిగా మారింది.

**వ్యాపార రక్షణ కవచం అక్రిడేషన్ కార్డు..??**

ప్రభుత్వ కాంట్రాక్టులు చేస్తూనే, విలేకరి అవతారమెత్తి తమ బిల్లుల క్లియరెన్స్ కోసం అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ ముసుగులో నిజమైన జర్నలిస్టులకు దక్కాల్సిన గౌరవాన్ని, హక్కులను ఈ "వ్యాపార విలేకరులు"కాలరాస్తున్నారు.

**అనర్హులకు అక్రిడేషన్ ఎలా..??**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేరే లాభసాటి వ్యాపారాలు చేసే వారికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వకూడదు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో వాస్తవాలను తనిఖీలు చేసి జిల్లా అధికారులు ప్రభుత్వానికి అనుబంధంగా వ్యాపారాలు చేసే వ్యక్తుల అక్రిడేషన్ కార్డులను తక్షణమే రద్దు చేయాలి.

**ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు..??**

అధికార గర్వంతో, కార్డు అండతో చెలరేగిపోతున్న ఇటువంటి వ్యక్తులపై జిల్లా కలెక్టర్ మరియు సమాచార శాఖాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుదారుల ఆర్థిక మూలాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలి. ప్రభుత్వ కాంట్రాక్టులు, వ్యాపారాలు ఉన్నట్లు తేలితే వారి అక్రిడేషన్లను వెంటనే రద్దు చేయాలి.వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే, రాబోయే రోజుల్లో సాధారణ పౌరులకు ప్రభుత్వ సేవలందడం కష్టతరంగా మారుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# కాగితాలపై కాదు కాళ్లమీద నిలిచే పథకాలు

**45వ వార్డ్ సభలో డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి హామీ.**



మెట్రో న్యూస్ మహబూబ్ నగర్ (టౌన్) మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్ టీచర్స్ కాలనీలో శనివారం నిర్వహించిన వార్డ్ సభ ప్రజా భాగస్వామ్యానికి వేదికగా మారింది. కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాతతొలిసారిగానిర్వహించిన ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కార్పొరేటర్ సల్మాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగాడిప్యూటీమేయర్,మాట్లాడుతూ, "ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన కార్యాచరణలో భాగంగా అమలు చేస్తున్న పథకాలుఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీఅర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలాచర్యలు,తీసుకుంటామని తెలిపారు.అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరుతూ, నగర అభివృద్ధికి ప్రజల సహకారం శ్రీఅవసరమని సూచించారు. అనంతరం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ విఠల్ రెడ్డి, 48వ డివిజన్ కార్పొరేటర్ సువర్ణ కిషన్ నాయక్, డీఈ నర్సింహులు, వార్డ్ ఆఫీసర్ భావన, ఆర్‌పి జయమ్మ, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బేజుగం రాఘవేందర్,మోహన్,రెడ్డి ,మైత్రియాదయ్య, మున్నూరు రవి, వార్డ్ ప్రతినిధులు, మహిళా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు

# మలేరియా అంతం చేయాలంటే దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవాలి

**ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. రవికుమార్**

నాగర్ కర్నూల్ (మెట్రో న్యూస్:ఏప్రిల్ 25) ప్రజల భాగస్వామ్యంతో మలేరియాను అంతం చేయాలని, దోమలు పుట్టకుండా కుట్టకుండా చేయడంలో ప్రజలు సామాజిక బాధ్యత వహించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె రవికుమార్ తెలిపారు. శనివారం నాడు ప్రపంచ మలేరియా దినోత్సవం అని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీని జెండా ఊపి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు 2007 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న




ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ సంవత్సరం డబ్ల్యూ .హెచ్.ఓ. సూచించిన అంశం "మలేరియాను అంతం చేయాలని తపన - ఇప్పుడు మనము చేయగలం". ప్రజలకు ఎవరికైనా జ్వరం వస్తే మీ దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మొదటగా రక్త పరీక్ష చేయించుకుని మలేరియా ఉందా లేదా అని నిర్ధారించుకోవాలన్నారు. మలేరియా రక్త పరీక్ష కిట్టు ఆర్. డి. టి. లు అన్ని ఆరోగ్య కేంద్రాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీటి తొట్టెలలో , డ్రమ్ములు, ట్యాంకులు నీటిని ఖాళీ చేసి ,కొబ్బరి పీచుతో శుభ్రపరుచుకుని, 30 నిమిషాలు ఆరబెట్టుకొని తిరిగి నీరు నింపుకోవాలని ప్రతి ఒక్కరు ఈ విధంగా చేయడం వలన దోమలు పెరుగుదలను అరికట్టగలమని తెలియజేశారు. ఇంటి లోనికి దోమలు ప్రవేశించకుండా కిటికీలకు, తలుపులకు మెష్ (జాలీని) బిగించుకోవాలని, దోమతెరలు వాడాలని దోమ కాటు నుండి రక్షించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రాజశేఖర్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సృజన, ఎం ఎల్ హెచ్ పి లు, పర్యవేక్షణ సిబ్బంది సుకుమార్ రెడ్డి, వై శ్రీనివాసులు, విజయ్ కుమార్, కొత్త నిరంజన్, విజయ్, ఫసియుద్దిన్, కోట్ల బాలాజీ,ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్ కృష్ణారావు, ఫార్మసీ అధికారులు సురేష్ కుమార్, కుమార్, హెల్త్ అసిస్టెంట్ రాజ వర్ధన్ రెడ్డి, ఏఎన్ఎంలు జి జె కవిత, సరస్వతి, ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు

## -నేటితో 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' ప్రారంభం -అయిజ మున్సిపల్ కమిషనర్ సైదులు



అయిజ, ఏప్రిల్ 25 (మెట్రో న్యూస్):-ప్రభుత్వం కల్పించిన 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' (స్వయం గణన) అవకాశాన్ని అయిజ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సైదులు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రేపటి నుండి మే 10వ తేదీ వరకు ఈ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా https.se.census.gov.in అనే వెబ్‌సైట్ పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి.అక్కడ రాష్ట్రాల జాబితాలో తెలంగాణను ఎంపిక చేసుకోవాలి.కుటుంబ యజమాని పేరు, మొబైల్ నంబర్, జిల్లా మరియు పట్టణం యొక్క పిన్ కోడ్ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.వివరాలన్నీ సరిచూసుకుని సబ్మిట్ చేసిన తర్వాత, మీకు ఒక 11 అంకెల ఐడీ వస్తుందని ఆయన వివరించారు.పౌరులందరూ గడువులోగా తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల మరమ్మత్తు పనులు వేగవంతం చేయండి.





**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.**

మిర్యాలగూడ, మెట్రో న్యూస్. నిర్మాణం పూర్తి కాని ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. శనివారం నియోజకవర్గ పరిధిలో అసంపూర్ణంగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇళ్లను సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలింపాటి, తహసిల్దార్ శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్,విద్యుత్ అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి మాట్లాడుతూ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అదేశించారు.రోడ్లు, త్రాగునీరు, ఎలక్ట్రిసిటీ లాంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా పనులు పూర్తిచేయాలని సూచించారు.పనులను అధికారులు ప్రతిరోజు పర్యవేక్షిస్తూ పనులు త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేయాలని అన్నారు..

# ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కృషి చేస్తా

**ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**



మెట్రో న్యూస్,(ఏప్రిల్ 25)సూర్యాపేట ప్రతినిధి: సూర్యాపేట ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా సూర్యాపేట జర్నలిస్టులు ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు అంతా ఏకతాటిపై ఉంటూ తమకు కావలసిన వాటిని సాధించు కోవాలని సూచించారు.తమకి అవసరం అయిన వాటిని అందిపుచ్చుకొని ప్రజలకు చేరాల్సిన సంక్షేమ పథకాలు అందించటంలో కృషి సల్పాలని కోరారు.ప్రస్తుతం జర్నలిస్టులకు అత్యవసరంగా కావలసింది ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం అని, అందుకోసం అవకాశం వచ్చినప్పుడు తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వజ్జే వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఐతగాని రాంబాబు, కోశాధికారి తల్లాడ చందన్,సీనియర్ జర్నలిస్టు మిక్కిలినేని శ్రీనివాస్ రావు, బొజ్జ ఎడ్వర్డ్,బుక్క రాంబాబు, ఊటుకూరి రవీందర్,అమరగాని నాగేందర్,రెబ్బ విజయ్,ఉయ్యాల నర్సయ్య,పెనుగొండ మల్లిఖార్జున్, మామిడి శ్రావణ్,మామిడి శంకర్,కంచర్ల సురేందర్,అజయ్,జంపాల ఉపేందర్,తండ వెంకన్న,వెంకన్న తదితరులు ఉన్నారు.

# పేదలకు సొంతింటి కల నెరవేరుతుంది

**అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ళు**

**పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి**





నల్లగొండ బ్యూరో, మెట్రో న్యూస్.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు.శనివారం నల్గొండ పట్టణంలోని 13వ డివిజన్ విద్యుత్ నగర్ కాలనీలో పస్తాం శ్రీను - సంధ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటితో పేద ప్రజల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులంతా ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఇస్తున్న రూ. 5 లక్షలతో పాటు కొంత మొత్తాన్ని కలుపుకుని ఇండ్లు నిర్మించుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో నల్గొండ నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య,34 డివిజన్ కార్పొరేటర్ ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, 13 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంచర్లకుంట్ల వెంకటరెడ్డి, నాయకులు దోనాల నాగార్జున రెడ్డి, కత్తుల రాంబాబు, నిమ్మనగోటి రమేష్, శ్రీకాంత్ రెడ్డి, పసత్ అలీ, చెరుపల్లి మురళి, గోవర్ధనగిరి, బొజ్జ వెంకన్న, గుజ్జుల నాగిరెడ్డి, రమేష్ గౌడ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన-2027 లో "స్వీయ గణన" (సెల్ఫ్ ఏనుమేరేషన్ ) విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ శ్రీ బి. చంద్రశేఖర్.**




నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్. జనగణన-2027 ప్రక్రియలో భాగంగా, ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన "స్వీయ గణన" (సెల్ఫ్ ఏనుమేరేషన్ ) విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ బి. చంద్రశేఖర్ ఒక కోరారు.
శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వీయ గణన ప్రక్రియ 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని, జనగణనను ప్రభుత్వం రెండు దశల్లో నిర్వహిస్తున్నదని మొదటి విడత మే 11 నుండి జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్ హౌస్ సెన్సెస్ ఉంటుందని, ఫిబ్రవరి 9, 2027 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు జనగణన ఉంటుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముఖ్యమైన స్వీయ గణనలో అందరూ భాగస్వాములు కావాలని,ప్రజలు తమ వివరాలను స్వయంగా అధికారిక వెబ్ పోర్టల్ ఒవ.ఏవఅంబం.ప్రశీజ.అఅ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు 15 నుండి 20 నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని,నమోదు పూర్తయ్యాక మొబైల్ లేదా ఇమెయిల్‌కు ఒక రాజు ×ణ వస్తుందని, తర్వాత దశలో ఎన్యూమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఈ రాజు ×ణ చూపిస్తే నమోదు ధృవీకరణ పూర్తవుతుందని తెలిపారు. నల్గొండ జిల్లాలో 5 లక్షల 3 వేల గృహాలు ఉన్నాయని, 3729 హౌసింగ్ బ్లాక్ లను, 479 సర్కిల్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 3179 గణకులను 5031 మంది సూపర్వైజర్లను, 41 మంది చార్జి అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి నిర్వహిస్తున్న ఈ జనగణన పూర్తిగా డిజిటల్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విడత నిర్వహించే జనగణమనలో కులం వివరాలను కూడా నమోదు చేయడం జరుగుతుందని, జనగణనకు సంబంధించి నాలుగు విడతల శిక్షణ నిర్వహించాల్సి ఉండగా, ఇదివరకే రెండు విడతలు పూర్తి చేశామని ,ఏప్రిల్ 27 నుండి మూడో విడత శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. స్వీయగణనపై విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజలందరూ భాగస్వాములు అయ్యేలా చూడాలని, దీనివల్ల రాష్ట్ర, జాతీయ స్థాయిలో రూపొందించే పథకాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, సిపిఓ శ్రీనివాస్ నాయక్, డి పి ఆర్ ఓ యు. వెంకటేశ్వర్లు, హాజరయ్యారు.

# పేద కుటుంబాలకు భరోసా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

**రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

**701మంది లబ్ధిదారులకు రూ.7.02కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులు పంపిణీ**







మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాలకు వెలుగులు నింపాలనే సంకల్పంతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సూర్యాపేట శాసన సభ్యులు జగదీశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 701మంది లబ్ధిదారులకు రూ.7.02కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి, ఏఐ సిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాసవి వనిత క్లబ్ ల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం




మెట్రో న్యూస్(ఏప్రిల్ 25)నేరేడుచర్ల: పట్టణంలోని వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ జీవో విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి శనివారం నేరేడుచర్ల పట్టణం లోని ప్రధాన కూడలి వద్ద క్లబ్ సభ్యులు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....ఆర్యవైశ్యుల అభ్యర్థన మేరకు అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి,ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు నీలా రామ్మూర్తి,సెక్రటరీ చెరుకు రాము,కోశాధికారి చారగుండ్ల వెంకటేశ్వర్లు,మాజీ డిస్ట్రిక్ట్ చైర్మన్ కందిబండ శ్రీనివాసరావు,మాజీ క్లబ్ అధ్యక్షులు ఊటుకూరు నటరాజ్,మాజీ సెక్రటరీ ఉప్పల పుల్లయ్య,నీల శ్రీనివాస్,వజ్రపు శ్రీనివాస్,తాళ్లూరి శ్రీనివాస్,గుంటూరు శ్రీనివాస్,రాచకొండ రవి,కుక్కండ్ల వెంకటేశ్వర్లు,తడకమళ్ల పరమేశం,వజ్రపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## "కాంగ్రెస్ తీరు.. దొడ్డిదారి రాజకీయం: ఓటమి భయంతోనే 'నామినేటెడ్' డ్రామా!"

**బిఆర్ఎస్ నాయకుడు నీలా హేమ్లా నాయక్**



మెట్రో న్యూస్,(ఏప్రిల్ 25) గరిడేపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నేరుగా ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తరిమికొడతారనే భయంతోనే, కాంగ్రెస్ ప్రభుత్వం 'నామినేటెడ్' పదవుల పేరుతో అప్రజాస్వామిక పంథా అవలంబిస్తోందని బిఆర్ఎస్ నాయకులు, హుజూర్నగర్ ఏఎంసీ మాజీ డైరెక్టర్. గుగులోతు నీలా హేమ్లా నాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం గరిడేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజలను ఫేస్ చేయలేక దొడ్డిదారిలో నామినేటెడ్ పదవులను కట్టబెడుతోంది. ఇది అచ్చంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని కేసీఆర్ పాలనలో 'రాజు'లా ఉన్న రైతు, నేడు సాగునీరు, ఎరువులు, 24 గంటల కరెంట్ లేక రోడ్లపైకి వస్తున్నాడు. యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది.రైతు భరోసా లేదు, పూర్తిస్థాయి రుణమాఫీ ఊసే లేదు. కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఎన్నికలు జరపకుండా కాలయాపన చేస్తున్నారు అని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ అరాచక పాలనను చూస్తున్న ప్రజలు, ముఖ్యంగా రైతాంగం మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటోంది. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సందీప్ నాయక్, నరేందర్ నాయక్, బాలు నాయక్, నాగు నాయక్, వెంకట్ రామ్ నాయక్, కోటయ్య తదితరులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై గళమెత్తారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆతిథ్యం తీసుకుంటున్న ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు



మెట్రో న్యూస్, (ఏప్రిల్ 25) హుజూర్ నగర్:ఓజో ఫౌండేషన్ చైర్మన్ గౌరవ శ్రీ పిల్లుట్ల రఘు మర్యాదపూర్వకంగా ప్రముఖ న్యాయవాది నగేష్ రాథోడ్ ఇంటికి విచ్చేసి వారిని కలిసి ఏప్రిల్ 26వ తారీకు న ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి శ్రీ గుంతకండ్ల జగదీశ్ రెడ్డి సారధ్యంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా తన పార్టీ లోనికి ఆహ్వాన కార్యక్రమం కలదని ఈ కార్యక్రమానికి తప్పకుండా రావాలని వారిని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను సాధారంగా ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మఠంపల్లి మాజీ జడ్పీటీసీ జగన్ నాయక్, ముల్కపల్లి రాంబాబు, కోలా శ్రీనివాస్ గౌడ్, గోబ్బి రాము, షేక్ హన్ను, పల్లె రమేష్ రెడ్డి, కాకునూరి శివ రెడ్డి, బాణావత్ చిరంజీవి, గుగులోత్ కృష్ణా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుశర్ల సత్యనారాయణ పై చర్యలు తీసుకోవాలి

మెట్రో న్యూస్,(ఏప్రిల్ 25)సూర్యాపేట ప్రతినిధి: నిరక్షరాస్యులైన గొర్రెల కాపరులు బయ్య లింగయ్య,బయ్య రోశయ్య, సుమలత, గంగయ్య, మేకల కృష్ణయ్యలపై గురువారం రోజున అకారణంగా నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ కర్రలతో దాడిచేసిన దుశర్ల సత్యనారాయణ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామనర్సయ్య, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బోర సుభాష్ లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఎస్పీ నరసింహ కు దుశర్ల సత్యనారాయణ పై బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...... మోతె మండలం రాఘవాపురం ఎక్స్ రోడ్డు సమీపంలో ఉన్న 70ఎకరాల అటవీ క్షేత్రం యజమాని అని చెప్పుకుంటు, తన భూమి సమీపంలో ఉన్న అమాయక ప్రజలపై రాజకీయ నాయకుల అండదండలతో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, ఆయన అరాచకాలతో మహిళలు, గొర్రెల కాపరులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు తన భూమి సమీపంలో మేసేందుకు వెళ్లిన చెట్లను నరికివేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారని, బాధితులపై గురువారం అలాగే ఆరోపిస్తు, నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ చేతిలో ఉన్న కర్రతో కొట్టడంతో, బాధితులు తమ ఆత్మ రక్షణ కొరకు తిరిగి దాడి చేశారని పేర్కొన్నారు. దీంతో పాటు ఆయన 70 ఎకరాల అటవీ క్షేత్రంలో 5 ఎకరాల భూమి మాత్రమేనని సత్యనారాయణదని, మిగిలిన 65 ఎకరాల భూమిలో చెరువు శిఖం, ప్రభుత్వ భూములున్నాయాని, జిల్లా అధికారులు దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మట్టిపల్లి సైదులు, శ్రీశైలం, భయ్యా సుధాకర్, గుండాల గంగులు, దానయ్య, గుండాల వీరయ్య, మేకల జానయ్య, వీరబోయిన వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడిపై సత్వరమే స్పందించాలి

**ప్రజల గొంతు ఎండకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
**వేసవి కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు కావాలి**
**ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించేలా వ్యవస్థ ఉండాలి**
**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**
**త్రాగునీరు సమస్యపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే**



కొత్తగూడెం ఆర్ సి ( మెట్రో న్యూస్): వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు సత్వరమే స్పందించి పరిస్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. శనివారం స్థానిక సింగరేణి అతిథిగృహంలో మిషన్ భగీరథ, కొత్తగూడెం కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా బోర్ల మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం కలిగించే పైప్‌లైన్ లీకేజీలను యుద్ధప్రాతిపదికన అరికట్టాలని, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. కొనసాగుతున్న నీటి పథకాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి చివరి ఇంటికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని, నీటి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు...

**- రాయిగూడెం 'ప్రజా దర్బార్'లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి**
**- న్యాయమైన సమస్య అయితే పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ**



నేలకొండపల్లిమెట్రో ఈవెనింగ్ ఏప్రిల్ 25: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు.- పారదర్శక పాలన -

**ప్రజల ముంగిటకే యంత్రాంగం**

గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి తెలిపారు. "ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ. మీ కష్టాలను వినే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

- క్లస్టర్ల వారీగా.క్షుణ్ణంగా పరిష్కారం

ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా, ప్రతి పంచాయతీకి ఒక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టడం ద్వారా సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. స్పాట్‌లోనే పరిష్కరించే వీలున్న సమస్యలను వెంటనే తేల్చేయాలని, మిగిలిన వాటికి వారం, నెల, మూడు నెలల చొప్పున గడువు నిర్ణయించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

"రాజకీయాలు ఎన్నికల వరకే. గెలిచిన తర్వాత ప్రభుత్వం అందరిది. అడిగిన పని న్యాయమైనదైతే, ప్రజలకు ఉపయోగపడేదైతే తప్పకుండా పూర్తి చేస్తాం" అని మంత్రి వివరించారు. ఈ నియోజకవర్గంలో చేస్తున్న ఈ ప్రయోగం రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అమలు చేయడానికి ఒక నమూనాగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

శాఖల వారీగా సమీక్షలు

ఈనెల 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను పారదర్శకంగా, వడివడిగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజల ఆశీస్సులే నా బలం**

"మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించి నన్ను గెలిపించారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ కష్టాలను తీర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. అసాధ్యమైన హామీలు నేను ఇవ్వను కానీ.. మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే దాన్ని పూర్తి చేసే బాధ్యత నాది" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

## కార్మిక ఐక్యతకు దక్కిన అద్భుత విజయం

**హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేయొద్దు**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**



కొత్తగూడెం ఆర్ సి ( మెట్రో న్యూస్) : కార్మిక ఐక్యతకు దక్కిన అద్భుత విజయమని, సమ్మె ద్వారా కార్మికులు తమ సత్తా చాటారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె విరమణ సందర్భంగా శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. హక్కుల కోసం సాగిన వీరోచిత పోరాటం వృథా కాలేదని, కార్మికుల ఐక్యమత్యం ముందు ప్రభుత్వం దిగిరాక తప్పలేదని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కుటుంబాలను వదిలి రోడ్లపై పోరాడిన కార్మికుల పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. చర్చల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, తక్షణమే క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని, సమస్యలు మళ్ళీ తలెత్తకుండా శాశ్వత మార్గాలను అన్వేషించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

## గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం

**క్రమశిక్షణే ఆభరణం - విజయమే గమ్యం**
**స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో**
**గురుకుల విద్యార్థులకు స్వేరో నెట్వర్క్ ఘన వీడ్కోలు**
**సెలవుల్లోనూ 'లక్ష్యం' వీడొద్దు**



ఖమ్మంమెట్రో ఈవెనింగ్ ఏప్రిల్ 25 : గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం అని, ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యా సంవత్సరాన్ని అత్యంత క్రమశిక్షణతో, ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న జోనల్ ఆఫీసర్ అలివేలు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయ బృందానికి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో వారు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు.

**సెలవుల్లోనూ 'లక్ష్యం' వీడొద్దు :**

వేసవి సెలవుల కోసం ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్వేరో నెట్వర్క్ ఆకాంక్షిస్తుందన్నారు. సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేసేలా సముచిత మార్గదర్శకత్వం అందించాలని కోరారు. కొత్త లక్ష్యాలతో, రెట్టింపు ఉత్సాహంతో తదుపరి విద్యా సంవత్సరానికి సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వేరో జిల్లా కమిటీ తరుపున విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ సానుకూల స్పందన హర్షణీయం

**ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యం**
**ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలి**
**కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**
**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

కొత్తగూడెం ఆర్ సి ( మెట్రో న్యూస్) : ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షణీయమని, ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని కార్మికుల సమ్మెపోరాటం మరోసారి రుజువుచేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె విరమణ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావడం శుభపరిణామమని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సమ్మె కాలంలో కార్మికులు ప్రదర్శించిన ఐక్యత స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కేవలం తాత్కాలికంగా హామీలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా, ఇచ్చిన ప్రతి మాటను గెజిట్ రూపంలోకి మార్చి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను వీడి, వారి సంక్షేమానికి పెద్దపీట వేసినప్పుడే వ్యవస్థలు బలోపేతం అవుతాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆగమైపోతుంది

**తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ ఆవేదన**
**ఖమ్మంలో రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం**



ఖమ్మంమెట్రో ఈవెనింగ్ ఏప్రిల్ 25 :కొట్లాడి సాధించుకున్న తెలంగాణ నేడు ఆగమైపోతుందని, కెసిఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ కబంధహస్తాల్లో చిక్కుకుందని అటువంటి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని మామిళ్ల గూడెంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని కపిలవాయి దిలీప్ కుమార్ శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమాలలో ఆనాడు చురుకైన పాత్రను తను పోషించానని, కెసిఆర్ తో కలిసి చేసిన ఉద్యమాలు రాష్ట్రంలో ఉవ్వెత్తిన ఎగిసి పడిందని గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అయ్యారని, ఉద్యమ సమయంలో దళితుడే ముఖ్యమంత్రి అని ప్రకటించిన కేసీఆర్ దళితులకు ఇవ్వకుండా తానే ముఖ్యమంత్రిగా ఉండి దళితులకు ఇచ్చిన మాట తప్పి కుటుంబ పాలన కొనసాగించాడని విమర్శించారు. కెసిఆర్ పాలనలో ఈ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందకుండా ఆగమై పోయిందని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్న పాలన ప్రజాభీష్టం మేరకు కొనసాగించాలని, ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే ఏ ప్రభుత్వం అయినా ఎల్లకాలం కొనసాగలేవని అన్నారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బీరప్ప, కోశాధికారి కె .గిరీష్, యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ విక్రమ్ శర్మ, సూర్యాపేట అధ్యక్షులు డాక్టర్ సోమ గాని నరేందర్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు జానీ మహమ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వర చారి, స్టేట్ సెక్రెటరీ ఎన్. భాస్కరరావు, ఆర్ ఎల్ డి స్టేట్ జనరల్ సెక్రెటరీ సుధాకర్ యాదవ్, స్టేట్ జనరల్ సెక్రెటరీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకం

**క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే భవిష్యత్తుకు పునాది**
**క్రీడలు ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని ప్రసాదిస్తాయి**
**వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి**
**నియోజకవర్గ విద్యార్థులకు ఉచిత శిక్షణాశిబిరం సువర్ణ అవకాశం**
**సెల్‌ఫోన్ల మాయలో పడకుండా మైదానాల్లో ప్రతిభ చాటాలి**
**జూన్ 7 వరకు సాగనున్న క్రీడా సంబరం**
**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(మెట్రో న్యూస్): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి సిఈఆర్ క్లబ్బులో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్, గేమ్స్ కోచింగ్ క్యాంపును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గించి విద్యార్థులలో అపారమైన ఉల్లాసాన్ని ఏకాగ్రతను ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. వేసవి సెలవులను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని తమలోని అంతర్గత ప్రతిభను వెలికితీయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణాశిబిరం ఒక సువర్ణ అవకాశమని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి తరం పిల్లలు ఇళ్లకే పరిమితమై సెల్‌ఫోన్ల మాయలో పడి సమయాన్ని వృథా చేయకుండా మైదానాల్లో చెమటోడ్చి ఆడితేనే రేపటి చాంపియన్లుగా ఎదగగలరని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ శిబిరంలో కబడ్డీ, క్రికెట్, స్విమింగ్, యోగా, అథ్లెటిక్, నెట్ బాల్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ వంటి పది రకాల క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూన్ 7వ తేదీ వరకు నెల రోజుల పాటు సాగనున్న ఈ క్రీడా సంబరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మెళకువలు నేర్చుకోవాలని కోరారు. క్రీడల ద్వారా అలవడే ఓర్పు పట్టుదల జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను సింగరేణి సహకారంతో కల్పిస్తున్నామని తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా కార్యాలయం అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అథ్లెటీకు సెక్రటరీ మహేందర్, బాక్సింగ్ మట్టపర్తి రమేష్, యుగంధర్ రెడ్డి, రమేష్ నాయుడు, వెంటేశ్వర్లు, మల్లికార్జున, నాగేందర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయినీ స్టార్స్ మాంటెస్సోరి స్కూల్‌లో ఘనంగా ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ఖమ్మం మెట్రో ఈవినింగ్ ఏప్రిల్ 25:ఖమ్మం సహకార నగర్‌లోని బ్రెయినీ స్టార్స్ మాంటెస్సోరి స్కూల్‌లో ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సమక్షంలో ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శ్రీ జైనుల్ పాషా గారు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్య అనేది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని, చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, విలువలు అలవరచుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారిని మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలసి సహకరించాలని ఆయన తెలిపారు.

ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలతో అందరిని అలరించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యనిలు ఉజ్మా, శైలజ, సునీత, ప్రశాంతి, నీలిమ, మాధవి, నాగమణి, నగిన, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రామలింగాపురంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం



కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ ఏప్రిల్ 25:కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ (రామలింగాపురం) లింగం బంజర గ్రామం లో నూతనంగా నిర్మాణం చేసిన గంగమ్మ తల్లి ఆలయం, ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు వేద పారాయణం గణపతి పూజ, 10: 32 నిమిషాలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట అనంతరం ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు ప్రతిష్ట కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి బ్రహ్మశ్రీ అను గోజు వీరభద్రచార్యులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**-వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ**



మెట్రో న్యూస్ బెజ్జంకి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ అన్నారు. శనివారం కల్లెపెల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ హాజరై ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోని మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పర్ష సంతోష్ ,జెల్లా ప్రభాకర్, బైర సంతోష్, ఎర్రల రాజు, మంత అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



మెట్రో న్యూస్ కొల్చారం: నైన్ జలాల్పూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ దేవి సింగ్ ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో భాగముగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి దళారుల నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. చివరి గింజల వరకు కూడా ధాన్యాన్ని సేకరించే బాధ్యత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మయ్య, ఉప సర్పంచ్ వెంకట నరసింహులు, సర్పంచ్లు దేవన్నగారి శేఖర్, స్వామి నాయకులు వేమారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, గ్రామ సీనియర్ నాయకులు చిన్న రాయన్న, సీఈఓ సాయి రెడ్డి, రాములు, యేసు పహాడ్ పాషా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**17 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం**

**15 కోట్లతో నర్సాపూర్ మున్సిపాలిటీ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**





మెట్రో న్యూస్ నర్సాపూర్ :కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి 17 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు,గనులు, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీలో 4,6 వ వార్డులలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇండ్లను మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ ప్రతిమ సింగ్ ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి ,మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ప్రస్తుతం కొన్ని ఇండ్లు పూర్తి అయి ప్రారంభించడం జరిగిందని, మరికొన్ని ఇండ్లు వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు, వచ్చే సంవత్సరం మరో 2500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను 100% పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అర్హత ఉండి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్న వారికి కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచి ఇల్లు నిర్మించుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ 10 సంవత్సరాల కాలంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని మోసం చేసిందన్నారు. అదేవిధంగా నర్సాపూర్ మున్సిపాలిటీ లో 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలని అన్నారు. నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి 15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ పాలకవర్గం చైర్మన్ ,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ప్రతిరోజు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ప్రజలతో నిత్యం ఉంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి , కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్, లలిత బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# మట్టిని తవ్వి తరలిస్తే ఊరుకునేది లేదు

**పాలకవర్గంపై మండిపడ్డ గ్రామస్తులు**



మెట్రో న్యూస్ హత్నూర మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని అల్వాల చెరువులో నల్ల మట్టిని తవ్వి తరలిస్తే ఊరుకునేది లేదని ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో మట్టి వ్యవహారం రసాభాసగా మారింది. ఈ విషయమై గ్రామస్తులు ఇదివరకే జిల్లా కలెక్టర్ కు,సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. లాభాపేక్షతో కొంతమంది స్వార్థ పరులు చెరువులోని మట్టిని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడ్డారు. గ్రామంలో హడావిడిగా చాటింపు వేయడం ఆగమేఘాల మీద తీర్మానాలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఒండ్రు మట్టిని అప్పనంగా కట్టబెట్టడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. అక్రమ మట్టి తరలింపు ప్రక్రియలో ప్రేక్షక పాత్ర పోషిస్తున్న గ్రామ కార్యదర్శిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

## రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా రమేష్ గౌడ్ ఎన్నిక





మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మాసభలు ఈనెల 23, 24, 25 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించారు. శనివారం ఈ యొక్క మహా సభలలో సంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయరాజు, మునిపల్లి గ్రామానికి చెందిన జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ ను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర మహా సభలలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజులలో రైతుల సంక్షేమం కోసం, కౌలుదారుల సమస్యలపై, పోరాటాలు నిర్వహించి రైతులందరికీ అండగా ఉంటామని తెలిపారు.

## కాలేశ్వరంపై కోర్టు క్లీన్ చీట్ ఇవ్వడం హర్షించ తగ విషయం.

**మాజీ జెడ్పి విప్పునారాయణ.**



మెట్రో న్యూస్ జోగిపేట్. కాలేశ్వరం పై కోర్టు క్లీన్ చీట్ ఇవ్వడం పై టిఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అందోల్ మాజీ జడ్పీ వీపు నారాయణ తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకు లతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసే న నుండి కాలేశ్వరంపై విషం కక్కారని నారాయణవిమర్శించారు. ఇండియాలోని మేధావులు సైతం కాలేశ్వరం నుమెచ్చుకుంటే కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం మాత్రం దానిపై దుమ్మెత్తి పోసారని చివరికి ధర్మమే గెలిచిందని తెలిపారు. కాలేశ్వరం ప్రాంతంలోని ఏడు ఎనిమిది జిల్లాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం విషం కక్కుతున్న రన్నారు . దానిపై ఘోష్ కమిటీ వేశారని అధి ఒకఫేక్ కమిటీ అని విమర్శించారు. నీర, నిధులు, నియమాలపై టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాలేశ్వరంపై అనాదిగా బురద చల్లుతూనే ఉన్నారన్నారు.. దీనిపై కోర్టు క్లీన్ చీట్ ఇవ్వడంపై వారు కోటుకు ధన్యవాదాలు తెలిపారు. నిన్న జరిగిన జగిత్యాల మీటింగ్ లో కేసీఆర్ పార్టీ మీటింగ్ కాదని జీవన్ రెడ్డి పార్టీలో కలిసిన మీటింగ్ అన్నారు. దానికి సీఎం కెసిఆర్ ను బొంద పెడతా ప్రతిపక్ష హోదా కూడా లేకుం డా చేస్తానని విమర్శించడం సరికాదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగన్న గౌడ్, మాజీ ఎంపీపీ బాలయ్య, టిఆర్ఎస్ నాయకులు పత్తి వీరేశం మొగ్గులయ్య, శంకరయ్య, సాతికేరాజు,, కరుణాకర్, దుర్గయ్య, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులారా వ్యక్తిగత విమర్శలు మానుకోండి..

**సిజిఆర్ ప్రజల కష్టసుఖాల్లో నిలబడతాడు**

**అధికార పార్టీ నాయకులు అభివృద్ధి చేసి చూపండి మాటలు కాదు..**

**చిమ్ముల గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులకు కౌంటర్..**



మెట్రో న్యూస్ /జిన్నారం : కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలో మానుకోవాలని రాజకీయంగా మాట్లాడడం వేరు వ్యక్తిగతంగా దూషించడం మానకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్తామని బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ అధ్యక్షతనమీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మున్సిపల్ చైర్పర్సన్ కుమార్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి చిల్లర మాటలు వ్యక్తిగతంగా దూషించడం మానుకోవాలని హితవు పలికారు. అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చమని ప్రతిపక్షంగా నిలదీయడంలో తప్పేముందన్నారు. నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రతిపక్ష పార్టీగా కచ్చితంగా నిలదీస్తామన్నారు.

కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు ఆధారాలతో నిరూపించాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రజాప్రతినిధులుగా గెలుపొందుతున్నామన్నారు. ప్రజలు మూడుసార్లు తిరస్కరించిన వ్యక్తి పెద్దపెద్ద మాటలు మాట్లాడడం మానుకోవాలన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ రాజీనామా చేస్తే సామాన్య కార్యకర్తను నిలబెట్టి గెలిపించుకుంటామని సవాల్ విసిరారు. సిజిఆర్ నిరుపేద ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటూ సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నానన్నారు. అధికార పార్టీ నాయకులు పేద ప్రజలకు తాను చేసిన దానికంటే రెట్టింపు సేవ చేసి వారి హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలన్నారు. అంతేకానీ వ్యక్తిగత విమర్శల వల్ల మీ స్థాయే తగ్గుతుంది. కాంగ్రెస్ నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి భారీ నిధులు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాంతఅభివృద్ధి కోసంమీతో కలిసి రావడానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అబిశెట్టి రాజశేఖర్, సంజీవరెడ్డి నాయకులు దేవేందర్ రెడ్డి , మాజీ మండల అధ్యక్షుడు హుస్సేన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమతులులేకుండా డ్రిల్లింగ్, భారీగా బ్లాస్టింగ్

**కొండలను పిండి చేస్తున్న డ్రిల్లింగ్ యంత్రాలు**

**రాత్రి పగలు లేకుండా బ్లాస్టింగ్లు**

**అనుమతులు ఉన్నాయంటూ దుబాయింపు...**

**అటువైపు కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం**



మెట్రో న్యూస్ జిన్నారం /అమిన్ పూర్ :ఎలాంటి అనుమతులు లేకుండా భారీ స్థాయిలో డ్రిల్లింగ్ చేస్తూ బ్లాస్టింగ్ చేస్తున్నారు. పెద్ద పెద్ద బండలతో ఉన్న కొండలను భారీ డ్రిల్లింగ్ యంత్రాలతో పిండి చేస్తున్నారు. రాత్రి పగలు లేకుండా బ్లాస్టింగ్లు జరుపుతూనే ఉన్నారు. బ్లాస్టింగ్లతో పక్కనే నిర్మాణాలు అదురుతూ బీటలు వాలుతున్నాయయి. ఎలాంటి సేఫ్టీ ప్రమాణాలను పాటించకుండా కార్మికులతో విధులు నిర్వహించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.. గుత్తేదారులు పెద్ద పెద్ద బండరాలకు డ్రిల్లింగ్ యంత్రాలతో పెద్ద రంధ్రం చేసి మందు గుండు సామాగ్రితో గుట్టలను పేల్చేస్తున్నారు. ఇదంతా ఔటర్ రింగ్ రోడ్డుకు అతి సమీపంలో మెడికల్ డివైసర్ ఇండస్ట్రీ పార్కులో చోటు చేసుకుంటుంది. ఇంత జరుగుతున్న అటువైపు అధికార యంత్రాంగం ఎందుకు కన్నెత్తి చూడటం లేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న దళారులకు అధికారులకు కొమ్ముకాస్తున్నారా అంటే అధికారులు పర్యవేక్షణ చేయకపోవడమే దీనికి నిదర్శనం మెడికల్ డివైసర్ ఇండస్ట్రియల్ పార్కులో టీజీఐఐసీ నుంచి ఇండస్ట్రీ కోసం స్థలాలు పొందిన పారిశ్రామికవేత్తలు ఆ స్థలంలో గుట్టలను చదును చేసేందుకు కొంతమంది గుత్తేదారులకు బాధ్యతలు అప్పజెప్తున్నారు. వారు అమాయక కార్మికులతో భారీ యంత్రాలతో డ్రిల్లింగ్ చేస్తూ బండరాళ్లతో ఉన్న గుట్టలను పిండి చేస్తున్నారు. బ్లాస్టింగ్లు చేసే సమయంలో కార్మికులు ఏ విధమైన సేఫ్టీ తీసుకోకుండా బ్లాస్టింగ్లు చేపడుతున్నారు ఆ సమయంలో జరగరానిది ఏదైనా జరిగితే అభం శుభం తెలియని కార్మికుల కుటుంబాలు రోడ్డుపాలు అవుతాయి. బ్లాస్టింగ్లకు అనుమతులు పోలీస్ శాఖ నుంచి తీసుకున్నామంటూ నిర్వాహకులు దబాయిస్తున్నారు. కానీ వీటికి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపణలో ఉన్నాయి. అనుమతులు లేకుండా బ్లాస్టింగ్లకు తెర లేపుతున్న ఈ వ్యవహారంపై పూర్తి విచారణ జరిపి సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కాలుష్య జలాలు వదులుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు



**ఎమ్మెల్యే,తాసిల్దార్, పిసిబి అధికారులకు కాజిపల్లి నాయకులు వినతి..**

మెట్రో న్యూస్/జిన్నారం : గడ్డపోతారా మున్సిపల్ పరిధిలోని కాజిపల్లి గ్రామానికి పై భాగంలో ఉన్న రసాయన పరిశ్రమలు కాలుష్య వ్యర్థ జలాలను వదులుతూ చెరువులను, గ్రౌండ్ వాటర్ కలుషితం చేస్తున్నాయని, రసాయన జలాలను వదులుతున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరించాలని కాజి పల్లి నాయకులు శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ కుమార్ పాఠక్, తాసిల్దార్ దేవదాసు కు వినతి పత్రం అందజేశారు. కాలుష్య రసాయన జలాలతో తమ గ్రామం పూర్తిగా నష్టపోతుందని వీటిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో గద్దె గణేష్, ఆకుల నవీన్,మన్నె సురేష్, చిరుమని శ్యామ్, ఆకుల అశోక్, జనార్ధన్,ఖదీర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ




మెట్రో న్యూస్/జిన్నారం : వ్యక్తిగత శుభ్రత,పరిసరాల పరిశుభ్రతతో మలేరియాను నిర్మూలించొచ్చని ప్రాథమిక వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పురపాలక పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కుమార్ గౌడ్ తాసిల్దార్ పరమేశ్వర్ హాజరయ్యారు. దోమ కాటు వల్ల వ్యాప్తి చెందే మలేరియా వ్యాధిని వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో నిర్మించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన తో చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్ల యితే ఎన్నో రకాల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేష్, రాజిరెడ్డి, రమేష్, చంద్రశేఖర్, నాయకులు పుట్ట నర్సింగ్ రావు, హుస్సేన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్ రెడ్డి, మద్ది భాస్కర్ రెడ్డి, అంగన్వాడి,ఆశ సిబ్బంది ఏఎన్ఎంలు ఎం.ఎల్.హెచ్ .పి లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ దుకాణ సముదాయములు వేలం

**-పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి**

మెట్రో న్యూస్ బెజ్జంకి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ దుకాణ సముదాయముల 2026/2027 కిరాయి వేలం పాటను మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 35 వేల రూపాయిలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

# పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం

**మెట్రో న్యూస్, హస్తినాపురం:** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినాపురం, బైరమల్ గూడ డివిజన్లలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జడ్పీ రోడ్డు తెలంగాణ చౌరస్తా నుండి టీకేఆర్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిపై గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను శనివారం భారీ ఎత్తున తొలగించారు. మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రతాప్ ఆధ్వర్యంలో ఎమ్ ఎమ్ సి ప్రత్యేక బృందం జేసీబీ సహాయంతో రంగంలోకి దిగింది. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాల విస్తరణలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, మట్టి కుప్పలు వంటి అనధికార నిర్మాణాలను పూర్తిగా తొలగించి రహదారిని స్వచ్ఛంగా మార్చారు. ఈ చర్యలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయని టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్ తెలిపారు. నగరంలోని ప్రధాన రద్దీ మార్గాల్లో ఒకటైన ఈ రహదారిపై కూరగాయల మార్కెట్లు నిర్వహించబడుతున్న నేపథ్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు తీవ్ర ట్రాఫిక్ సమస్యలకు, ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తున్నాయి. స్థానిక ప్రజలు, ముఖ్యంగా పాదచారులు మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూరగాయల వ్యాపారులకు ప్రత్యామ్నాయ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇటీవల వివిధ మీడియాలలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన అధికారులు ఈ చర్యలు గట్టి బందోబస్తు మధ్య తొలగించారు . అయితే, ఈ తొలగింపు చర్యలు ఒక్కసారిగా మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా కఠిన పర్యవేక్షణ అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. శాశ్వత పరిష్కారం కోసం నిరంతర తనిఖీలు, కఠిన చర్యలు చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు టీపీఎస్ సాయి అర్చన, చైన్ మెన్‌లు సత్యనారాయణ, కృష్ణ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రవీందర్ గౌడ్, వి. రవి చారి, పాండు, హనుమంతు, మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యంగాఫుట్‌పాత్‌లు ప్రజలకోసంవాటిని ఆక్రమించడం చట్ట విరుద్ధం. ప్రజలు కూడా చట్టాలను పాటిస్తూ నగర శుభ్రత, రవాణా సౌకర్యాల మెరుగుదలలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.







## కూచిపూడి నాట్యం శిక్షణ



**మెట్రో న్యూస్ ఎల్బీనగర్ :** బైరామల్ గూడ డివిజన్ మాధవ నగర్ కాలనీ, కమ్యూనిటీ హాల్లో నర్తన కేలి ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించే కూచిపూడి నాట్య శిక్షణ మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య శిక్షకురాలు నవ్య భారతి ఆధ్వర్యంలో కాలనీలోనీ విద్యార్థినీ విద్యార్థులకు వేసవికాలం శిక్షణ ఏర్పాటు, పూర్వం భరతనాట్యం ఎక్కువగా ప్రాచుర్యంలో ఉండేది నేటి తరానికి దిక్సూచిగా ఉండాలని ఈ కాలనీలో శిక్షణ తరగతులు ఏర్పాటు . ఈ కాలనీ లోని విద్యార్థినీ విద్యార్థులు వేసవికాలంలో ఈ శిక్షణ పొంది మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని పెంపొందించుకోవచ్చు అనే ఉద్దేశంతో ఏర్పాటు చేశాం పిల్లలలో ఆత్మస్థైర్యం ఆత్మ విశ్వాసం ఆరోగ్యం అన్ని విధాలుగా లబ్ధి చేకూరుతుంద నీ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ వెల్లడించారు నవ్య భారతి మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రతిరోజు ఈ శిక్షణ ఏర్పాటు చేస్తున్నాము ఈ నెల 30వ తేది వరకు కొనసాగుతుంది. కాలనీ విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వెల్లడించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు,డాక్టర్ ప్రణీత్, యమ్మ భాష పుష్పమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ , మధులస, కమిటీ మెంబర్, సంయుక్త, , హారతి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**- ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, మెట్రో న్యూస్ :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, గంగారం వార్డులలో నిర్వహిస్తున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. 2002 ఓటర్ జాబితాకు 2025 జాబితాను పరిగణలోకి తీసుకొని మ్యాపింగ్ ను చేపట్టాలనిభూతుస్థాయిఅధికారులకుకలెక్టర్ సూచిం చారు. మ్యాపింగ్ చేసే క్రమంలో ఎలాంటి పొరపాటులు జరగకుండాజాగ్రత్తలుతీసుకోవాలనికలెక్టర్‌సూచించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఆర్డీఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్‌విక్రమసింహారెడ్డిలు పాల్గొన్నారు.



## సుందరయ్య కాలనీ రోడ్ నెంబర్ 8లో సిసి రోడ్ వేయాలి

**- మురుగునీరు పైప్ లైన్‌ను తొర్రూర్ వరకు పొడిగించాలి**
**- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య**



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ వార్డ్ కమ్మగూడ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో రోడ్డు నెంబర్ 8లో సిసి రోడ్ వేయాలని డ్రైనేజ్ లైన్ పొడిగించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ రోడ్ నెంబర్ 8 సీసీ రోడ్డు వేయాలని కమిషనర్ ను కోరారు. కమ్మగూడ పరిధిలోని మస్కతి డైరీ,రాజ్ రంజిత్ కాలనీ,సాయి ప్రియ, టీచర్స్ కాలనీ కమ్మగూడ వివిధ కాలనీలలో నుంచి వచ్చే మురుగునీరు, డ్రైనేజీ లక్ష్మీనగర్ సుందరయ్య కాలనీ దగ్గరలో వదిలేయడం జరుగుతుంది దీనివల్ల సుందరయ్య నగర్ కాలనీవాసులు అనేకమంది విష జ్వరాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మురుగునీరు పైపులైన్ ను తొర్రూర్ రోడ్ వరకు పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏర్పుల నరసింహ, తుర్కయాంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి. కిషన్ మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ, ఇల్లూరి భాస్కర్ పార్టీ శాఖ కార్యదర్శి ఐ కృష్ణ,పార్టీ నాయకుల కే. సత్యం, మాధవరెడ్డి ,శంకర్ నాయక్, కే రవి నాయక్,సామెల్,కే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ హైవేలో రోడ్డు ఆక్రమణలను తొలగించిన అధికారులు

**- రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**
**- ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి**




**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** ఆదిభట్ల సర్కిల్ పరిధిలో రోడ్డు ఆక్రమణలపై అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. శనివారం ఇంజాపూర్, తుర్కయంజాల్, మన్నెగూడ,బొంగులూరు రింగ్ రోడ్డు వరకు సాగర్ హైవే ప్రధాన రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు, దుకాణాల ముందుకు పొడిగించిన ర్యాంపులు, మెట్లు వంటి అక్రమ నిర్మాణాలను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆక్రమణలను గుర్తించి తొలగించినట్లు తెలిపారు. సదారు దుకాణ యజమానులకు ముందుగా పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో కఠిన చర్యలకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ చర్యలతో రహదారులు విస్తరించి, ట్రాఫిక్ రాకపోకలు సాఫీగా జరుగుతాయన్నారు. రహదారులు మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇకపై కూడా రోడ్డు ఆక్రమణలపై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు

**- దండుమైలారం, ముక్కునూర్, నేర్రపల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో రూ.2 కోట్ల 15 లక్షలతో అభివృద్ధి పనులు**
**- 159 మంది లబ్ధిదారులకు 1 కోటి 59 లక్షల 18 వేలు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**
**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**





**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం మండలంలో వివిధ గ్రామాలలో రూ. 2 కోట్ల 15 లక్షలతో నెర్రపల్లి, దండుమైలారం, ముక్కునూర్, పోల్కంపల్లి గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో 159 మంది లబ్ధిదారులకు రూ. 1 కోటి 59 లక్షల 18 వేల 444 రూపాయల కళ్యాణ లక్ష్మీ, శాధిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, విద్యా, మౌలిక వసతుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ సంకల్పమని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు చేరేల కృషి చేస్తామని తెలిపారు. ఆడ బిడ్డల పెళ్లిలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న ఈ పథకం ఎంతో మందికి ఆశీర్వాదంగా మారిందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పేదింటి పిల్లలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భారీ నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు మండల రూపురేఖలను మార్చనున్నాయని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 17వ వార్డులో ఇక కరెంటు కోతలు లేకుండా 3 ఫేస్ ఏర్పాటు





**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** మున్సిపాలిటిలోని 17వ వార్డు గోకుల్ నగర్ వాసులకి వార్డు కౌన్సిలర్ మడుపు లక్ష్మమ్మ గోపాల్ శుభవార్త తెలియజేసారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా గోకుల నగర్ ఫీడర్ను 2ఫేజ్ నుండి 3ఫేజ్కు మారుస్తానన్నీ హామీ ఇచ్చారు. గత నెల రోజుల ప్రయత్నంలో శనివారం టిజిఎస్పిడిసిఎల్ ఏఈ సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించడంతో అధికారులు గోకుల్ నగర్ కాలనీలో 3 ఫేస్ కరెంటు ఏర్పాటు చేశారు. వార్డులోని ప్రతి సమస్యలను తీరుస్తూ, ప్రజలకు అండగా ఉంటామని మడుపు శివసాయి అన్నారు. దింతో వార్డు కౌన్సిలర్, ఏఈ అధికారిలకు కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, మెట్రో న్యూస్ :** అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఆపరేషన్ కార్డులు అందజేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పాల్గొని మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జి ఓ నెం. 252 ప్రకారము నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. మీడియా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని, కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన అన్నారు. సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. ఈ సమావేశం లో జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, కమిటీ సభ్యులుగా రవి శంకర్, సూర్య రఘు, మల్లేశం, ప్రహ్లాద చారి, పాపి రెడ్డి, శ్రీనివాస్, ఎ పి ఆర్ ఓ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సహాయం



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం :** పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సహాయం అందించిన 5వ వార్డు కౌన్సిలర్ జెర్కొని మమతా రాజు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన చెరుకూరి రాములమ్మ, రాములు అనే దంపతులు నివాసం ఉంటున్నారు. కాగా నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో కుమార్తె రమ్యశ్రీ వివాహానికి ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే ఉన్నాయి. దీంతో విషయం తెలుసుకున్న 5వ వార్డు కౌన్సిలర్ జెర్కొని మమతా రాజు రమ్యశ్రీ వివాహానికి తమ వంతు సహాయంగా రూ. 10,116 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మంద సుధాకర్,కొండ్రు మహేష్ తదితరులు పాల్గొన్నారు.









# ఇంధన కొరతపై సీఎం చంద్రబాబు సమీక్ష


అమరావతి ఇంధన కొరతతో ఏపీలో పలు చోట్ల పెట్రోల్ బంకుల మూసివేతపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో పరిస్థితులు, ఇబ్బందులపై అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు. బంకుల యజమానులు. ఇంధన కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

సీఎం ఆదేశాలతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఇంధన సరఫరాపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్తో ఫోన్లో చర్చలు జరిపారు. తక్షణం స్టాక్ ని బంకుల వివరాలు అందించాలని ఆదేశించారు. స్టాక్సమస్య ఉంటే తక్షణం టోల్ ఫ్రీ నంబర్ 1967కు కాల్ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కోరారు. గత ఏప్రిల్ కంటే పదిశాతం అదనపు సరఫరాకు ఆయిల్ కంపెనీలు అంగీకారం తెలిపాయి. సీఎం ఆదేశాలతో పెట్రోల్ డీలర్ల నుంచి ఏపీఎఫ్పీటీ ప్రధాన కార్యదర్శి రావి గోపాలకృష్ణ వివరాలు సేకరిస్తున్నారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఆరోగ్య పరిస్థితిపై ఆరా ఇటీవలే గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వల్ప అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు తిరిగి వచ్చిన గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, యథావిధిగా విధుల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

మర్యాదపూర్వక భేటీ మాత్రమే ఈ భేటీ కేవలం గవర్నర్ ఆరోగ్యాన్ని పరామర్శించేందుకు జరిగిన మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. సుమారు కొంతసేపు జరిగిన ఈ సమావేశంలో గవర్నర్ కోలుకుంటున్న తీరును, వైద్యులు అందిస్తున్న సూచనలను సీఎం అడిగి తెలుసుకున్నారు.





# తిరుమల కల్తీ నెయ్యి విచారణ పూర్తి

## 30న నివేదిక సమర్ప

తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదంలో ఏపీ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తన విచారణను పూర్తి చేసింది. ఈ వ్యవహారంలో కీలక ఆధారాలు సేకరించిన కమిషన్, ఈ నెల 30న ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. క్షేత్రస్థాయిలో సమగ్ర దర్యాప్తు

ఫిబ్రవరి 20న ఏర్పాటైన ఈ ఏకసభ్య కమిషన్ తిరుమలలో పలుమార్లు పర్యటించింది. నెయ్యి కొనుగోలు విధానం, టెండర్ల ప్రక్రియ, నెయ్యి నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నెయ్యి సరఫరాలో జరిగిన లోపాలు, కల్తీకి గల కారణాలపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టింది.

ఈ విచారణలో భాగంగా నిపుణుల కమిటీ సభ్యుడు విజయభాస్కర్ వాంగ్మూలాన్ని కమిషన్ నమోదు చేసింది. నెయ్యి సేకరణలో పాటించాల్సిన నిబంధనలు, ఎక్కడ ఉల్లంఘనలు జరిగాయనే అంశంపై ఆయన వివరణ ఇచ్చారు.

30న వెలుగులోకి రానున్న వాస్తవాలు దర్యాప్తులో తేలిన అంశాలను నివేదిక రూపంలో ఈ నెల 30న రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ అందజేయనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకుంటుందో అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నివేదిక బయటకు వస్తే ఈ వ్యవహారంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# గజరాజుల విధ్వంసం



గురువారం రాత్రి రామిరెడ్డిపల్లి పంచాయతీ, కూచివారిపల్లిలో సురేంద్ర నాయుడు మామిడితోటలో ఏనుగుల గుంపు ప్రవేశించి బోరు పైపులు, మామిడి చెట్లు, పంటను ధ్వంసం చేశాయి. రాకేష్ మరణించిన నాటి నుండి నేటి వరకు తరచూ గజరాజుల గుంపు లేదా ఒంటరి ఏనుగు గ్రామాలపై పడి పంట పొలాలను నాశనం చేస్తున్నప్పటికీ కట్టడి చర్యలు చేపట్టడంలో, పరిహారం చెల్లించడంలోనూ కంటితుడుపు చర్యలకే పరిమితమవు తున్నారు. రైతన్నలు అప్పులు చేసి, శ్రమకోర్చి పండించిన పంటలతో పాటు వృక్ష సంపదను ధ్వంసం చేస్తున్న ఏనుగుల మందను నిలువరించలేని నిస్సహాయ స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడు తున్నారు.

మానవ తప్పిదాలతో అటవీ ప్రాంతంలో ఆహార కొరతలు తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ఏనుగులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు ఆహారం కోసం గ్రామాలపై పడుతున్నాయి. గోవా నుండి తిరుపతి వరకు ఏనుగుల కారిడార్గా పరిగణిస్తారు. తమిళనాడులోని ముదిమల, పెరియార్ అభయారణ్యాలతో పాటు పొల్లాచ్చి, కర్ణాటకలోని కౌడన్య, బంతూరు గట్ట, దండేలి, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచల అడవులు కుప్పం, పలమనేరు చంద్రగిరి నియోజక వర్గంలోని చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాళ్యం, చంద్రగిరి మండలాల్లోకి ఏనుగుల రాకపోకలు సీజన్‌ను అనుసరించి సాగిస్తుంటాయి.



# పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు

పెట్రోల్ కంపెనీల యాజమాన్యం నేరుగా కార్పొరేట్ కంపెనీలకు 40 డీజలు సరఫరా చేస్తుంది. పెట్రోల్ బంకులలో డీజిల్ పట్టుకుంటే ధర తక్కువగా ఉండడంతో ఆయా వాహనదారులు ఎక్కువగా పెట్రోల్ బంకులలో నింపుకుంటున్నారు. కార్పొరేట్ సంస్థల కస్టమర్లు వారికి నేరుగా విక్రయించే డీజిల్ ధర ఎక్కువగా ఉండటంతో స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకులలో డీజిల్ నింపుకుంటున్నారు. తమకు కార్పొరేట్ సంస్థల వారు డీజిల్ విక్రయాలు జరపడం లేదని దానికి కారణం స్థానికంగా ఉన్న పెట్రోల్ పంపులు యాజమాన్యాల కారణమని అయా కంపెనీల వారు కృత్రిమ కొరత సృష్టించడంతో లభ్యత లేకపోవడంతో స్థానికంగా వాహనాలు నడిపేవారు, పెట్రోల్ బంకుల యాజమాన్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రతిరోజు డీజల్ నింపుకొని ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించేవారు అవస్థలు వర్ణనాతీతం. డీజిల్ కృత్రిమ కొరత వల్ల ప్రజా రవాణా, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కంపెనీలతో మాట్లాడి డీజిల్, పెట్రోలు సకాలంలో పెట్రోల్ బంకులకు వచ్చే విధంగా చూడాలని ప్రజలు ,పెట్రోల్ పంపుల యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శక్తి యాప్ తో యువతిని కాపాడాం మంత్రి అనిత



విజయవాడ బస్టాండ్‌లో ఫణీంద్ర అనే వ్యక్తి ఒక యువతిని బలవంతంగా ఆటోలో ఎక్కించుకున్నాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, ఒక నిర్మానుష్య ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో అప్రమత్తమైన బాధితురాలు తన ఫోన్‌లోని 'శక్తి' యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించింది.

పోలీసుల వేగవంతమైన చర్యలు యాప్ ద్వారా అందిన సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు వెంటనే స్పందించారు. నిందితుడి ఆటోను వెంబడించి, నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోకముందే అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని సురక్షితంగా రక్షించి, ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై స్పందించిన మంత్రి అనిత, ఆపద సమయంలో మహిళలకు శక్తి యాప్ ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని మహిళలందరూ తమ మొబైల్ ఫోన్లలో తప్పనిసరిగా 'శక్తి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.





ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లీసా గిల్ గారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తొలి మహిళా చీఫ్ జస్టిస్‌గా నియామకంపై అభినందనలు తెలిపారు.

# కాకినాడ కోర్టుకు వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు



కాకినాడ: వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబును కాకినాడలోని మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. కాకినాడ జీజీహెచ్లో వైద్యపరీక్షల అనంతరం కోర్టుకు తీసుకెళ్లారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించి, ప్రలోభపెట్టడంపై ప్రశ్నించారు. ఈ కేసులో అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. రాజమహేంద్రవరం కోర్టు ఆవరణలో అనంతబాబును పోలీసులు నిన్న అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



# బాన్సువాడలో విషాదం

## ఇడ్లీ ఇరుక్కుని బాలింత మృతి

డెలివరీ అయిన, కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు ఇడ్లీ తీసుకొచ్చి అర్చనకు తినిపించారు. ఈ క్రమంలో ఇడ్లీ గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక ఇబ్బంది పడింది. వెంటనే డాక్టర్లు ట్రీట్మెంట్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అర్చన చనిపోయింది. చిన్నారి పుట్టిన కొద్దిసేపటికే తల్లి చనిపోవడం కుటుంబంలో విషాదాన్ని నింపింది.డ్డ పుట్టిన కొద్దిసేపటికే తల్లి మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# టీడీపీని వీడి.. వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



విజయనగరం జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. గజపతినగరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గజపతినగరం మేజర్ పంచాయతీకి చెందిన సుమారు 50 కుటుంబాల యువకులు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జిల్లాలో ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నియోజకవర్గంలోని కీలకమైన మేజర్ పంచాయతీ నుండి యువత వైసీపీలో చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామ స్థాయి నుండి పార్టీని పునర్నిర్మించే క్రమంలో ఈ చేరికలు తమకు కలిసి వస్తాయని వైసీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

మెట్రో

# పీవీ సింధు కంటి పక్కన ఆ వింత పరికరం ఏంటి?



ఇటీవల జరిగిన ఉబెర్ కప్ మ్యాచ్ లో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కంటి పక్కన(కణత భాగంలో) ఓ స్టిక్కర్ లాంటి పరికరాన్ని ధరించి కనిపించింది. మ్యాచ్ జరుగుతున్నంత సేపు ఆ పరికరం అందరి దృష్టిని ఆకర్షించింది. అసలు అది ఏంటి? ఆటలో దానికి ఉన్న ప్రాముఖ్యత ఏంటనే చర్చ క్రీడా ప్రపంచంలో మొదలైంది. నిజానికి అది ఓ అత్యాధునిక పరికరం.. దీనిని ‹టెంపుల్› అని పిలుస్తున్నారు.

మెదడు పనితీరును పసిగట్టే సాంకేతికత ఈ పరికరం అథ్లెట్ల మానసిక స్థితిని అంచనా వేయడానికి రూపొందించబడింది. ఇది ప్రధానంగా మెదడులోని రక్త ప్రసరణను, ఆలోచనల తీవ్రతను, ఏకాగ్రత స్థాయిలను ట్రాక్ చేస్తుంది. ఆట సమయంలో క్రీడాకారులు ఎంత ఒత్తిడికి లోనవుతున్నారు? వారు ఏ సమయంలో అత్యంత ఏకాగ్రతతో ఉన్నారు? వంటి అంశాలను ఈ పరికరం డేటా రూపంలో విశ్లేషిస్తుంది. అథ్లెట్ల మెంటల్ స్టేటస్‌ను అర్థం చేసుకోవడం ద్వారా వారి ప్రదర్శనను మరింత మెరుగుపరచడానికి ఇది ఉపయోగపడుతుంది.

జొమాటో ఫౌండర్, సింధు భర్త భాగస్వామ్యం ఈ వినూత్న ప్రాజెక్ట్ వెనుక ప్రముఖ వ్యాపారవేత్తలు ఉన్నారు. జొమాటో ఫౌండర్ దీపిందర్ గోయల్ టీమ్ ఈ పరికరాన్ని అభివృద్ధి చేసింది. అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పీవీ సింధు భర్త వెంకట దత్తసాయి కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామిగా ఉన్నారు. ఓ రకంగా చెప్పాలంటే. స్పోర్ట్స్ టెక్నాలజీలో ఇదొక కొత్త విప్లవం అని చెప్పవచ్చు.

తొలిసారిగా సింధుపై ప్రయోగం ప్రస్తుతం ఈ ‹టెంపుల్› పరికరం ఇంకా టెస్టింగ్ దశలోనే ఉంది. ఓ అంతర్జాతీయ మ్యాచ్‌లో ప్రయోగాత్మకంగా దీన్ని మొదటిసారిగా పీవీ సింధుపై పరీక్షించారు. మైదానంలో ఆటగాళ్ల మెదడు ఏ విధంగా స్పందిస్తుందో తెలుసుకోవడానికి ఈ డేటా కోచ్‌లకు, శాస్త్రవేత్తలకు ఎంతో కీలకం కానుంది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ క్రీడా ప్రపంచంలో మరింత కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# చెంపదెబ్బతో హర్భజన్ సింగ్‌కు రూ.కోటి ఆదాయం.. శ్రీశాంత్

ఐపీఎల్ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన చెంపదెబ్బ ఘటనపై భారత మాజీ పేసర్ శ్రీశాంత్ మరోసారి నోరు విప్పాడు. దాదాపు 18 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘటనను హర్భజన్ సింగ్ తన వ్యాపార ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని శ్రీశాంత్ సంచలన ఆరోపణలు చేశాడు. హర్భజన్ తనపై చేసిన దాడిని సాకుగా చూపి.. ఓ ప్రకటన ద్వారా దాదాపు రూ.కోటి వరకు ఆదాయం గడించారని శ్రీశాంత్ విమర్శించాడు.

కోటి రూపాయల ఆదాయంపై శ్రీశాంత్ ఆరోపణలు శ్రీశాంత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హర్భజన్ ఆనాటి చేదు జ్ఞాపకాన్ని మార్కెట్ చేసుకుంటున్నారని మండిపడ్డాడు. నాటి చెంపదెబ్బ ఘటన ఆధారంగా భజ్జీ ఇటీవల ఓ యాడ్ చేశాడు. దాని ద్వారా ఆయనకు రూ.కోటి ఆదాయం వచ్చింది. అంతటితో ఆగకుండా, ఆ యాడ్‌ను నా సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసి ప్రమోట్ చేయమని స్వయంగా నాకు ఫోన్ చేసి అడిగాడు. అప్పుడు నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నేను అతడిని క్షమించాను కానీ, ఆ ఘటనను మాత్రం ఎప్పటికీ మర్చిపోను॥ అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు.

నటన అంటూ శ్రీశాంత్ విమర్శలు హర్భజన్ సింగ్ వివిధ ఇంటర్వ్యూలలో ఆ ఘటనపై పశ్చాత్తాపం వ్యక్తం చేయడం కేవలం సానుభూతి కోసమేనని శ్రీశాంత్ కొట్టిపారేశాడు. భజ్జీ మాటలన్నీ నటనేనని, అందుకే తాను అతడిని ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లాక్ చేశానని తెలిపాడు. చాలా ఇంటర్వ్యూల్లో తాను పెద్ద తప్పు చేశానని భజ్జీ చెబుతుంటాడు. నా కుమార్తె గురించి కూడా ప్రస్తావించాడు. కానీ ఒకట్రెండు నెలల క్రితం ఆయన చేసిన ఆ యాడ్ చూశాక, అతడి అసలు రంగు బయటపడింది. మనకు జరిగిన చెడును మర్చిపోతే అవతలి వ్యక్తి మళ్లీ అదే తప్పు చేసే ప్రమాదం ఉంటుంది అని శ్రీశాంత్ ఆవేదన వ్యక్తం చేశాడు.

నేపథ్యం.. 2008 నాటి ఐపీఎల్ ఘటన 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో ముంబయి ఇండియన్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ వివాదం చోటుచేసుకుంది. ఆటగాళ్లు పరస్పరం కరచాలనం చేసుకుంటున్న సమయంలో హర్భజన్ సింగ్ ఒక్కసారిగా శ్రీశాంత్ చెంపపై కొట్టాడు. ఆ దెబ్బకు శ్రీశాంత్ మైదానంలోనే వెక్కి వెక్కి ఏడ్చాడు. ఈ ఘటన అప్పట్లో పెను సంచలనం సృష్టించగా.. బీసీసీఐ హర్భజన్‌పై 8 మ్యాచ్‌ల పాటు నిషేధం కూడా విధించింది. తాజాగా ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ ఆ వీడియోను విడుదల చేయడంతో ఈ పాత గాయం మళ్లీ చర్చనీయాంశమైంది.

అశ్విన్ ఇంటర్వ్యూలో భజ్జీ కామెంట్స్ ఇటీవల



రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హర్భజన్ సింగ్ ఈ ఘటనను గుర్తు చేసుకున్నాడు. శ్రీశాంత్ కుమార్తె తనను ఉద్దేశించి అన్న మాటలు తనను కలచివేసాయంటూ సానుభూతి వ్యక్తం చేశాడు. అయితే శ్రీశాంత్ తాజా కామెంట్స్, చూస్తుంటే, వీరిద్దరి మధ్య పాత వివాదం ఇంకా సమసిపోలేదని, పైగా కొత్త మలుపు తీసుకుందని స్పష్టమవుతోంది.

# ప్రత్యర్థులకు వార్నింగ్ ఇచ్చేశాడు కోహ్లీ మాస్ రియాక్షన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సాధించిన ఘన విజయం జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ మ్యాచ్‌లో ఆరెంజ్ క్యాప్ కైవసం చేసుకున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ విజయం అనంతరం తన ఆనందాన్ని పంచుకున్నారు. జట్టు సమష్టి కృషి, బౌలర్ల క్రమశిక్షణ, యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ ప్రదర్శనపై కోహ్లీ ప్రశంసలు కురిపించారు.

లక్ష్య ఛేదనలో తనతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన దేవదత్ పడిక్కల్‌ను కోహ్లీ గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించారు. మేము మ్యాచ్ ప్రారంభంలోనే పిచ్ పరిస్థితులను అంచనా వేయాల్సి వచ్చింది. ఓ బలమైన భాగస్వామ్యం ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడం సులభం. పడిక్కల్ ఈ సీజన్‌లో ఇప్పటికే రెండుసార్లు ఇలాంటి అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడాడు అని ఆయన పేర్కొన్నారు. ఓ యువ ఆటగాడు ఇంత పరిణతితో ఆడటం అరుదు. నిజానికి అతని ఇన్నింగ్సే మ్యాచ్‌లో అసలైన తేడాను చూపింది. మా మధ్య ఉన్న ఆ భాగస్వామ్యమే గేమ్ ఛేంజర్‌గా మారింది. అని కోహ్లీ స్పష్టం చేశారు. పడిక్కల్ ప్రదర్శన విజయంలో కీలకంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు.

గుజరాత్ టైటాన్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన ఆర్‌సీబీ బౌలర్ల పనితీరును విరాట్ కొనియాడారు. పిచ్‌పై స్పిన్నర్లకు ఆశించిన స్థాయిలో పట్టు దొరకనప్పటికీ, బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేశారన్నారు. పరిస్థితులను అర్థం చేసుకున్న తర్వాత, మా బౌలర్లు తమపై తాము నమ్మకం ఉంచి ప్రణాళికలను అమలు చేశారు. అని ఆర్‌సీబీ కెప్టెన్ తెలిపారు. లక్ష్యం పట్ల మాకు ఎలాంటి అనుమానాలు లేవు, చాలా స్పష్టమైన వ్యూహంతో బరిలోకి దిగాం అని కోహ్లీ వివరించారు. జట్టులోని సానుకూల ధోరణి, ఆటగాళ్లపై ఉన్న అచంచల విశ్వాసమే ఈ విజయానికి పునాది అని ఆయన నొక్కిచెప్పారు.

ఆర్‌సీబీ జట్టు కూర్పు, బెంచ్ బలంపై కోహ్లీ పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా కృనాల్ పాండ్యా జట్టులో ఉండటం తమకు అదనపు బలాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. మా జట్టులో ప్రత్యర్థి బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టగల ప్రతిభావంతులు చాలా మంది ఉన్నారు. అని కోహ్లీ తెలిపారు. కృనాల్ పాండ్యా స్మార్ట్‌నెస్‌పై కోహ్లీ విశ్లేషిస్తూ, కృనాల్ వంటి క్రికెట్ నాలెడ్జ్ ఉన్న ఆటగాడు జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాడు. ఇది అతని బౌలింగ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. మా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మంచి డెప్త్ ఉంది అని అన్నారు.

చివరగా, తన హోమ్ గ్రౌండ్ అయిన బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం గురించి కోహ్లీ భావోద్వేగంగా మాట్లాడారు. చిన్నస్వామిలో ఆడటం ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఇక్కడ క్రికెట్ ఆడటం నాకు చాలా ఇష్టం. మా సొంత అభిమానుల మధ్య ఈ సీజన్‌లో ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు గెలవడం గొప్ప ఆరంభం అని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం టోర్నమెంట్‌లో మా స్థానాన్ని మరింత బలోపేతం చేసింది. అని కోహ్లీ ముగించారు. ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా కోహ్లీ ప్రస్తుత ఫామ్ ఆర్‌సీబీ అభిమానుల్లో ఈసారి కప్పు గెలుస్తామన్న ఆశలను రేకెత్తిస్తోంది.




# ఆకలిని జయించి ఆసియా కప్‌కు

ఇది గెలుపు కోసం తపించే ఒక క్రీడాకారిణి కథ మాత్రమే కాదు.. ఆకలిని డ్రిబ్లింగ్ చేస్తూ, పేదరికాన్ని రివర్స్ హిట్ చేస్తూ.. సమాజం విసిరిన వివక్ష అనే బంతిని గోల్‌పోస్ట్‌లోకి నెట్టిన ఒక సామాన్య బాలిక అసామాన్య పోరాటం ఇది. విరిగిన హాకీ స్టిక్‌కు అతుకులేసుకుంటూ మొదలైన ఆమె ప్రస్థానం.. నేడు ఆసియాకప్ ముంగిట ఆశాదీపమై నిలిచింది.

జీవితం ఒక హాకీ మ్యాచ్ అయితే.. అందులో ఆమె ఎదుర్కొన్నవన్నీ పెనాల్టీ కార్నర్‌లే. ప్రత్యర్థి కేవలం మైదానంలోని ఆటగాళ్లు మాత్రమే కాదు.. ఆకలి, పేదరికం, సమాజం విసిరే విమర్శలు. మధ్యప్రదేశ్‌లోని సీవనీకి చెందిన 15 ఏళ్ల నౌషీన్ నాజ్ కథ వింటే ఎవరికైనా కళ్లు చెమర్చక మానవు. ఈ రోజు ఆమె భారత్ తరఫున అండర్-18 ఆసియాకప్ హాకీ ఆడేందుకు సిద్ధమవుతుండవచ్చు. కానీ ఆమె ప్రస్థానం మొదలైంది మాత్రం ఒక విరిగిన హాకీ స్టిక్‌తో.. అంతకంటే ఎక్కువగా విరిగిపోని గుండె నిబ్బరంతో!



విరిగిన కర్ర.. వెలకట్టలేని కల నౌషీన్ తండ్రి ఎహ్ఫాజ్‌ఖాన్ ఒక దినసరి కూలి. పాత అట్టపెట్టెలు, స్క్రాప్ సేకరించి అమ్మితే వచ్చేది రోజుకు రూ. 200 నుంచి రూ.400 మాత్రమే. ఆ ఇంట్లో ఏడుగురు సంతానం. వీరిలో ఐదుగురు ఆడపిల్లలు. ఒకపూట తిండి దొరకడమే గగనమైన వేళ.. వేల రూపాయల హాకీ కిట్ కొనడం ఆ తండ్రికి అసాధ్యమైన పని. కానీ, నౌషీన్‌కు హాకీ అంటే ప్రాణం. ఆడేందుకు స్టిక్ లేకపోతే, తన పొరుగున ఉండే ఒకబ్బాయి పారేసిన విరిగిన స్టిక్‌ను అడిగి తీసుకుంది. దానికి మేకులు కొట్టించుకుని, ఫెవిక్విక్ పూసి, ఒక పాత గుడ్డముక్కను చుట్టి తన హాకీ ప్రయాణాన్ని మొదలుపెట్టింది. మైదానంలో మిగతా పిల్లలు మెరిసిపోయే కిట్‌లతో ఆడుతుంటే ఈ చిన్నారి మాత్రం తన ఆకలిని మర్చిపోయి, ఆ విరిగిన స్టిక్‌తోనే బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపేది. “నా కూతురు ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. ఆ విరిగిన కర్ర విడిపోయినప్పుడల్లా మళ్లీ బట్టకట్టి ఆడుతూనే ఉండేది” అని ఆమె తండ్రి నీళ్లు నిండిన కళ్ళతో గుర్తుచేసుకున్నాడు.

సామాజిక వివక్ష నౌషీన్ కేవలం ఆర్థిక ఇబ్బందులనే కాదు, సామాజిక వివక్షను కూడా ఎదుర్కొంది. “హాకీ ఆడేటప్పుడు అమ్మాయిలు హాఫ్ ప్యాంట్లు వేసుకోవడం ఏంటి? ఇది మన పద్ధతి కాదు, మీ పిల్లల్ని తప్పుడు మార్గంలో నడిపిస్తున్నారు” అంటూ చుట్టుపక్కల వారు, బంధువులు వేలెత్తి చూపేవారు. ఆ మాటలు ఎహ్ఫాజ్‌ను బాధించేవి. కానీ, తన బిడ్డ కళ్లలోని కసిని చూసిన తండ్రి ఆ విమర్శలను లెక్క చేయలేదు. తన కుమార్తెల కలల కోసం సమాజంతో యుద్ధం చేశాడు. ఈ రోజు అదే వ్యక్తులు నౌషీన్‌తో ఫొటోలు దిగడానికి క్యూ కడుతున్నారు.

మైదానంలో గోల్స్ సునామీ నౌషీన్ ప్రతిభను 2023లో మధ్యప్రదేశ్ హాకీ అకాడమీ గుర్తించింది. అది ఆమె జీవితంలో ఒక పెద్ద మలుపు. అప్పటి వరకు సరైన తిండి, క్రీడా సామగ్రి లేని ఆమెకు అకాడమీ అండగా నిలిచింది. పౌష్టికాహారం, ప్రొఫెషనల్ శిక్షణ దొరకగానే ఆమె అసలైన ఆట మొదలైంది.

ఏకంగా 9 గోల్స్... ఇటీవల బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో ప్రత్యర్థి జట్లను నౌషీన్ ముప్పుతిప్పలు పెట్టింది. ఏకంగా 9 గోల్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలవడమే కాకుండా, ‘ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్’ అవార్డును కూడా కైవసం చేసుకుంది.

ఆసియాకప్ దిశగా అడుగులు నౌషీన్ వేగాన్ని చూసి హాకీ విశ్లేషకులు ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఆమె భోపాల్‌లోని జాతీయ క్యాంపులో శిక్షణ పొందుతోంది. మే 29 నుంచి జపాన్‌లో జరగనున్న అండర్-18 ఆసియాక్‌పకు ఎంపికయ్యే దిశగా ఆమె అడుగులు పడుతున్నాయి. అక్కడ కూడా ఆమెకు సొంత కిట్ లేదు. తోటి క్రీడాకారిణుల వద్ద సామగ్రి అడిగి తీసుకుని ప్రాక్టీస్ చేస్తోంది.

తన పరిస్థితిపై ఏమాత్రం కుంగిపోకుండా “నా లక్ష్యం ఒక్కటే.. దేశం తరఫున ఆడటం” అని ధీమాగా చెబుతోంది. పేదరికంపై తండ్రి విజయం నౌషీన్ తండ్రి ఇప్పుడు ఒక బలమైన గోల్‌కీపర్‌లా ఆమెకు రక్షణగా నిలుస్తున్నాడు. “ఒకప్పుడు నా కూతురు ఆటను చూసి భయపడేవాడిని, కానీ ఇప్పుడు గర్వంగా ఉంది. నా బిడ్డను అడ్డుకోవాలని చూస్తే, తొలుత నన్ను ఎదుర్కోవాల్సిందే” అని ఆయన చెబుతున్న మాటలు ఒక తండ్రికి ఒక బిడ్డ సాధించిన విజయంపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నాయి. నౌషీన్ బాటలోనే ఆమె చెల్లెలు సబారిక కూడా ఇప్పుడు హాకీ అకాడమీలో అడుగుపెట్టింది. నౌషీన్ చేతిలో ఇప్పుడు ఖరీదైన స్టిక్ ఉండొచ్చు. కానీ, ఆనాడు విరిగిన స్టిక్‌ను గుడ్డతో కట్టిన ఆ పట్టుదలే ఆమెను ఇవాళ ఈస్థాయికి చేర్చింది. గెలుపు గుర్రం ఎక్కడానికి కావాల్సింది సదుపాయాలు కాదు, సంకల్పం అని నౌషీన్ నిరూపిస్తోంది.

మెట్రో ప్రియాంక
ఆదివారం, 26 ఏప్రిల్ 2026
11

# సమ్మర్‌లో సేదతీర్చే చల్లని సూప్‌లు

ఎండాకాలంలో దాహార్తి తీర్చుకోవడానికి పండ్ల రసాలు, మిల్క్‌షేక్‌లు, కొబ్బరినీళ్లు, చెరుకు రసం ఇలా ఎన్నో రకాలు తాగుతూ ఉంటాం. వీటితోపాటు చల్లచల్లని సూప్‌లు కూడా తాగితే అలసట తీరుతుంది. మనకు అందుబాటులో ఉన్నవాటితో సులువుగా తయారుచేసుకోగలిగే విభిన్నమైన సూప్‌ల వివరాలు మీకోసం...

రైస్ కంజి కావాల్సిన పదార్థాలు అన్నం- అర కప్పు, మంచి నీళ్లు- ఒక కప్పు, చిక్కటి పెరుగు- అర కప్పు, ఉప్పు- అర చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నూనె- చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, మినప గుండ్లు- అర చెంచా, కరివేపాకు- కొద్దిగా, పచ్చిమిర్చి- నాలుగు, ఉల్లిపాయ- ఒకటి, అల్లం తరుగు- చెంచా, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం మట్టి గిన్నెలోకి అన్నాన్ని తీసుకుని అందులో నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ మిశ్రమాన్ని బ్లెండర్‌లో వేసి మెత్తగా బ్లెండ్ చేసి గిన్నెలోకి తీయాలి. అందులో పెరుగు, ఉప్పు, అల్లం తరుగు వేసి బాగా కలపాలి.

స్టవ్‌మీద పాన్ పెట్టి నూనె వేసి వేడిచేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, మినపగుండ్లు, ఇంగువ, కరివేపాకు, పచ్చి మిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. ఈ పోపును అన్నం-పెరుగు మిశ్రమంలో వేసి కలపాలి. ఇలా తయారుచేసుకున్న రైస్ కంజిని కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి.

చిల్డ్ మష్రూమ్ ట్రఫుల్ వెలౌటే కావాల్సిన పదార్థాలు మష్రూమ్స్- పావు కేజీ, వెన్న- రెండు చెంచాలు, కూరగాయలు ఉడికించిన నీళ్లు- ఒక కప్పు, ఫ్రెష్ క్రీమ్- పావు కప్పు, ఉప్పు- తగినంత, మిరియాల పొడి- అర చెంచా, ట్రఫుల్ ఆయిల్- చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం స్టవ్ మీద పాన్ పెట్టి వెన్న వేసి కరిగించాలి. తరువాత ముష్రూమ్స్ ముక్కలు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. ఆపైన బ్లెండర్‌లో వేసి కూరగాయలు ఉడికించిన నీళ్లు పోసి మెత్తగా బ్లెండ్ చేసి గిన్నెలోకి తీయాలి. అందులో ఫ్రెష్ క్రీమ్, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలిపి అరగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ సూప్‌ని గాజు బౌల్స్‌లో పోసి పైన ట్రఫుల్ ఆయిల్ వేసి కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.

సమ్మర్ ఫ్రక్టోజ్ సిప్ కావాల్సిన పదార్థాలు పుచ్చకాయ ముక్కలు- ఆరు కప్పులు, (స్టాబెర్రీ ముక్కలు- ఒక కప్పు, అవకాడో ముక్కలు- అర కప్పు, నిమ్మరసం- రెండు చెంచాలు, తేనె- రెండు చెంచాలు, పుదీనా ఆకులు- ఆరు, చల్లటి నీళ్లు- ఒక గ్లాసు, పింక్ సాల్ట్- చిటికెడు, ఐస్‌క్యూబ్స్- నాలుగు

తయారీ విధానం బ్లెండర్‌లో పుచ్చకాయ ముక్కలు, (స్టాబెర్రీ ముక్కలు, అవకాడో ముక్కలు, పుదీనా ఆకులు, తేనె, నిమ్మరసం, పింక్ సాల్ట్ వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. తరువాత చల్లటి నీళ్లు పోసి మరోసారి బ్లెండ్ చేయాలి. ఈ సూప్‌ని స్టయినర్ సహాయంతో పెద్ద గిన్నెలోకి వడబోయాలి. తరువాత సూప్ బౌల్స్‌లో పోసి ఐస్ క్యూబ్స్ వేసి (స్టాబెర్రీ స్లయిసెస్, పుదీనా ఆకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయడమే.

నట్టీ కుకుంబర్ మింట్ సూప్ కావాల్సిన పదార్థాలు కీరాలు- రెండు, చిక్కటి పెరుగు- రెండు కప్పులు, ఐస్ క్యూబ్స్- అయిదు, నట్స్- అర కప్పు (బాదం, పిస్తా, వాల్‌నట్స్, జీడిపప్పు, గుమ్మడి గింజలు, వేరుశనగ గుండ్లు), పుదీనా ఆకులు- పది, వెల్లుల్లి రెబ్బలు- రెండు, ఆలివ్ ఆయిల్- మూడు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, చిల్లీ ఫ్లేక్స్- రెండు చెంచాలు, చల్లటి నీళు- ఒక గ్లాసు

తయారీ విధానం కీరాలను శుభ్రంగా కడిగి తొక్క, తీసి మధ్యకు కోసి గింజలు తొలగించాలి. ఆపైన చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. పుదీనా ఆకులు, వెల్లుల్లి రెబ్బలను కూడా సన్నగా తరగాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నట్స్ వేసి దోరగా వేయించాలి. బ్లెండర్‌లో కీరా ముక్కలు, పెరుగు, పుదీనా ఆకుల తరుగు, వెల్లుల్లి తరుగు, వేయించిన నట్స్, నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, ఉప్పు, ఐస్ క్యూబ్స్ వేసి చల్లటి నీళ్లు పోసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఇలా తయారుచేసిన సూప్‌ని గ్లాస్ బౌల్స్‌లో పోసి పైన కొన్ని నట్స్, చిల్లీ ఫ్లేక్స్ చల్లి చల్లగా సర్వ్ చేయాలి.

మెట్రో ఈవినింగ్ సినిమా

# వెండితెరపైకి సమీరా రెడ్డి రీఎంట్రీ..



టాలీవుడ్‌లో 'జై చిరంజీవ', 'అశోక్' వంటి సినిమాలతో కుర్రకారు మనసు దోచుకున్న అందాల భామ సమీరా రెడ్డి మళ్ళీ కెమెరా ముందుకు వస్తున్నారు. 2014లో వివాహం తర్వాత కుటుంబ బాధ్యతలతో సినిమాలకు దూరమైన ఆమె, సుమారు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. బాలీవుడ్ అగ్ర నటుడు సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఆఖ్రీ సవాల్' చిత్రంతో ఆమె మళ్ళీ ప్రేక్షకులను పలకరించనున్నారు. జాతీయ అవార్డు గ్రహీత అభిజీత్ మోహన్ వారంగ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో ఆమె ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారు. ఇకపై రొటీన్ కమర్షియల్ పాత్రల కంటే నటనకు ఆస్కారం ఉన్న అర్థవంతమైన పాత్రలే చేస్తానని ఆమె స్పష్టం చేశారు.



# ధనుష్ 'కర' తెలుగు టీజర్ విడుదల



కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా, మమితా బైజు హీరోయిన్ గా నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'కర'. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా విడుదలైన ఈ సినిమా తెలుగు టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. "నేను నాటిన విత్తనం ఇప్పుడు కోతకు వచ్చింది.. నా మీద పడ్డ మచ్చను తుడిచేయాలి" అంటూ ధనుష్ చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్స్కి గూస్ బంప్స్ వస్తున్నాయి..

యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ జీవీ ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచింది. థేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ విజువల్స్‌ను మరో స్థాయిలో నిలబెట్టింది. కె.ఎస్. రవికుమార్, కరుణాస్, జయరామ్, పృథ్వీ పాండియరాజన్, సూరజ్ వెంజరమూడు, ఎం.ఎస్. బాస్కర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. త్వరలోనే చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాని ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. తమిళంతో పాటుగా తెలుగులోనూ విడుదల చేస్తున్నారు.

# విజయ్ 'జన నాయగన్' లీకేజీ కేసు



ప్రదీప్ ఇ. రాఘవ్‌కు ఇది కెరీర్‌లో 25వ సినిమా కావడం విశేషం. అయితే, ఎడిటింగ్ రూమ్ భద్రతలో విఫలమయ్యారనే కారణంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఒక ఫ్రీలాన్స్ అసిస్టెంట్ ఎడిటర్ అనధికారికంగా ఎడిటింగ్ రూమ్‌లోకి ప్రవేశించి ఫుటేజీని దొంగిలించినట్లు చెన్నై సైబర్ క్రైమ్ పోలీసుల విచారణలో తేలింది. ఈ విషయంలో ప్రధాన ఎడిటర్‌గా ఉన్న ప్రదీప్ నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని భావిస్తూ ఎస్ఐఎఫ్ఈఏ ఆయనను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది.



సినిమా లీకేజీపై రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇప్పటికే ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. షూటింగ్ పూర్తయినా విడుదలకు నోచుకోని ఈ సినిమా, ఇప్పుడు లీకేజీ రూపంలో మరో భారీ నష్టాన్ని మూటగట్టుకుంది. విజయ్ రాజకీయాల్లోకి వెళ్తున్న తరుణంలో ఆయన పాత సినిమాలు ఇలా వివాదాల్లో చిక్కుకోవడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.

# వరుణ్ తేజ్ సినిమా నుంచి సర్‌ప్రైజ్




వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' సినిమా నుంచి తాజా అప్‌డేట్ విడుదలైంది. ఇప్పటికే మంచి ఆదరణ పొందిన 'కమ్సహమ్నిదా' పాటకు సంబంధించిన మేకింగ్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది.

పాటలో సంగీతం, నటీనటుల సందడి

ఈ పాటకు సంగీతాన్ని తమన్ అందించగా, సాహిత్యం కాసర్ల శ్యామ్ రాశారు. గాయకుడు సిద్ శ్రీరామ్ తన గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చారు. పాటలో వరుణ్ తేజ్ మాస్ లుక్‌లో కనిపించగా, కథానాయిక రితికా నాయక్‌తో ఆయన జోడీ ఫ్రెష్‌గా ఉంది. మేకింగ్ వీడియోలో తెర వెనుక జరిగిన సరదా క్షణాలను చూపించారు.

# స్టైలిష్ 'భల్లాలదేవ'



రానా తనదైన పర్సనాలిటీకి తగ్గట్టుగా క్లాసీ అండ్ ట్రెండీ వేర్స్‌లో ఈ ఫోటోషూట్ చేశారు. ముఖ్యంగా ఆయన మెయింటైన్ చేస్తున్న కొత్త లుక్ (Handlebar Moustache) ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. గంభీరమైన చూపులు, స్టైలిష్ ఫోజులతో రానా ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌లో నిలిచారు. అభిమానులు "నయా మ్యాన్ ఆఫ్ స్టైల్" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

# 'టాక్సిక్' మామూలుగా ఉండదు




'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా 1950-70ల కాలం నాటి గోవా డ్రగ్ మాఫియా నేపథ్యంలో సాగనుంది. ఈ చిత్రంలోని విశేషాల గురించి యశ్ మాట్లాడుతూ, "శృంగార సన్నివేశాల నుంచి రక్తపాతం చిందించే యాక్షన్ సీన్స్ వరకు.. ప్రతి దానిలోనూ గీతూకు ఒక స్పష్టత ఉంది. ఒక మహిళా దర్శకురాలు ఇంతటి మాస్ ఎలిమెంట్స్‌ను ఇంత సున్నితత్వంతో చూపించగలరా అని నేను ఆశ్చర్యపోయాను" అని పేర్కొన్నారు.

ఈ సినిమాలో నయనతార, కియారా అద్వానీ వంటి అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని రియలిస్టిక్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఈ చిత్రంలో ఉండబోతున్నాయని యశ్ హింట్ ఇచ్చారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం జూన్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# నితిన్ కొత్త సినిమాలో హీరోయిన్ ఫిక్స్

'అశోకవనంలో అర్జున కళ్యాణం'తో అరంగేట్రం చేసిన రితికా, తన సహజ నటనతో అందరినీ మెప్పించింది. ఆపై తేజ సజ్జ సరసన 'మిరాయ్' వంటి భారీ సోషియో-ఫాంటసీ చిత్రంతో తన క్రేజ్‌ను రెట్టింపు చేసుకుంది. గీతా ఆర్ట్స్ వంటి అగ్ర సంస్థ ఇప్పటికే ఆమెతో మూడు సినిమాల ఒప్పందం కుదుర్చుకోవడం ఆమె డిమాండ్‌కు నిదర్శనం. నితిన్ సరసన ఆమె నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

వరుస ప్రాజెక్టులతో నితిన్ ఫుల్ బిజీ

ఫ్లాపులు ఎదురైనా ఏమాత్రం తగ్గకుండా నితిన్ వైవిధ్యమైన కథలను లైన్లో పెడుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సినిమాతో పాటు మరికొన్ని ప్రాజెక్టులు లైన్లో పెట్టారు. విభిన్నమైన కథాంశంతో ఆనంద్ రవి దర్శకత్వంలో ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'ఆయ్' చిత్రంతో హిట్ అందుకున్న దర్శకుడు అంజితో తన సొంత బ్యానర్ 'శ్రేష్ఠ మూవీస్'లో నితిన్ ఒక సినిమా చేయనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రాజెక్ట్ ఈ నెలాఖరున పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం కానుంది

# ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోబోతున్న వారణాసి బ్యూటీ



ప్రియాంకా చోప్రా సినీ రంగంలో అడుగుపెట్టి దాదాపు 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పురస్కారం దక్కడం విశేషం. మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న నాటి నుంచి, బాలీవుడ్‌లో అగ్ర నటిగా ఎదిగి, ఆపై హాలీవుడ్‌లో 'క్వాంటికో', 'సిటాడెల్' వంటి భారీ ప్రాజెక్టులతో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందే వరకు ఆమె ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. కేవలం నటనకే పరిమితం కాకుండా, ఒక నిర్మాతగా, వ్యాపారవేత్తగా మరియు సామాజిక కార్యకర్తగా ఆమె చూపుతున్న ప్రభావం ఈ అవార్డు ఎంపికలో కీలక పాత్ర పోషించింది. ఆసియా ఖండానికి చెందిన ప్రతిభను అంతర్జాతీయ వేదికలపై ప్రమోట్ చేయడంలో ఆమె ముందు వరుసలో నిలిచారు.

పలు రంగాల ప్రముఖుల సమక్షంలో వేడుక

గోల్డ్ హౌస్ గోల్డ్ గాలా అనేది కేవలం సినిమా రంగానికే పరిమితం కాదు. బిజినెస్, టెక్నాలజీ, ఫ్యాషన్ మరియు స్పోర్ట్స్ వంటి వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆసియా సంతతికి చెందిన వ్యక్తులను ఈ వేదికపై గౌరవిస్తారు. ఈ ఏడాది ప్రియాంకతో పాటు మరికొందరు అంతర్జాతీయ ప్రముఖులు కూడా వివిధ విభాగాల్లో అవార్డులు అందుకోనున్నారు.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007